శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



# గురుకృప

**శతవసంతం... ఆనందమే ఆసాంతం....**

జన్మదిన సంచిక



# బర్త్‌డే

**భక్తుడు :** గురువుగారూ! పిల్లల బర్త్‌డేను సెలబ్రేట్ చేసుకుంటే ఎలా చేసుకోవాలి? చేసుకోవచ్చా?

**గురువుగారు :** తప్పకుండా చేసుకోవచ్చు. బర్త్‌డేస్ అంటే ఇలానే జరగాలనే సిస్టమ్ నేను పెట్టలేదు. కానీ ఒక్కటిమాత్రం చెప్పగలను. మనకు ఏదైతే ఇష్టమో, ఆ ఇష్టమైనటువంటిది జరగాలి. నిజంగా చెప్పాలంటే, ఆ బర్త్‌డే రోజున వాళ్ళకు ఏం కావాలి? ఆ సంవత్సరం అంతా వాళ్ళకు మంచి జరగాలి. అదే కదా మన కోరిక! బెస్ట్‌విషెస్ అంటాం, హ్యాపీ బర్త్‌డే అంటాం. ఏం జరగాలి? ఆ సంవత్సర కాలమంతా వాళ్ళు హ్యాపీగా ఉండాలి. ఎలా ఉంటారు? బాబా బ్లెస్సింగ్స్ తీసుకుంటే. కాబట్టి బాబా బ్లెస్సింగ్స్ రావడానికి ఏం చేయాలో అది చేయాలి. నేను అదే చేసాను పాపకి. కొవ్వొత్తులు వెలిగించి, ఊదడం చేయలేదు. ద్వారకామాయికి తీసుకెళ్ళి కొవ్వొత్తులు వెలిగించడం చేసాను. అక్కడ నింబారులో 3 సంవత్సరాల పాపైతే 3 కొవ్వొత్తులు. అది జస్ట్ సింబాలిక్‌గా. పది క్రొవ్వొత్తులు వెలిగిస్తే తప్పని కాదు. కొవ్వొత్తులు ఊదడం కాదు. కేక్ ఎందుకమ్మా? చక్కగా పాపకు ఇష్టమైనది, మనకు ఇష్టమైనది, మన ఫ్రెండ్స్‌కి ఇష్టమైనది ఏదో చూసుకొని చెయ్యాలి. అందరికీ మిరపకాయ బజ్జీలు ఇష్టమైతే మిరపకాయ బజ్జీలు చేయండి. అలాగాక, ఒక్కొక్కరికి ఒక్కొక్కటి ఇష్టమైంది అనుకోండి. ఎక్కువమందికి ఏది ఇష్టమైతే అది చక్కగా, సంతోషంగా చేసి అందరికీ పెట్టండి. వాళ్ళు ఈ పాపబర్త్‌డే అని సంతోషంగా ఫీలవుతున్నారంటే , వాళ్ళలో ఉండేటువంటి ఆ ఆనందమే పాపకు బ్లెస్సింగ్స్ అవుతాయి. ఈ రోజున పాప బర్త్‌డే. ఈరోజు మా ఇంట్లో మేము బాబా నామం చేసుకొని ప్రసాదం ఇస్తున్నాము. అందరూ వచ్చి పాపను ఆశీర్వదించండి. అంతమంది సాయిభక్తుల ఆశీర్వాదం కంటే శ్రీరామరక్ష మనకేం కావాలి? ఇలా చేయాలి తప్పితే, ఎవరో చేసారని చెప్పి, మనం కూడా హ్యాపీ బర్త్‌డే అని మనకు రాని పాట ఒకటి పాడి, ఉఫ్ అంటూ దీపాలు ఆర్పి, కేకుని ఇలా అన్‌హైజీనిక్‌గా ఒకరినోట్లో ఒకరు పెట్టుకుంటూ చేతులను నాకుతూ ఉండటం ఏమిటి? ఒకసారి దీని గురించి ఆలోచించండి.

పిల్లలకు ఇలా అలవాటు చేయండి. బర్త్‌డే రోజంటే ఆరోజు చక్కగా పెద్దల దగ్గర బ్లెస్సింగ్ తీసుకోండి. బాబా బ్లెస్సింగ్స్ తీసుకోండి. ఈ రోజుల్లో బ్లెస్సింగ్స్ తీసుకోవడం అనేటటువంటి అన్‌ఫ్యాషనబుల్ అయింది. కానీ మనకు బాబా బ్లెస్సింగ్స్ కావాలి, పెద్దవాళ్ళ బ్లెస్సింగ్స్ కావాలి. ఇక్కడకొచ్చి మీరందరూ ఇలా కూర్చున్నది బ్లెస్సింగ్స్‌కే. కానీ బ్లెస్సింగ్స్ తీసుకోమని అడిగితే, What is this blessings? I don't want అంటాం. మనకు ఏం కావాలో, మనం నేచురల్‌గా ఏం చేస్తామో ఆ రకంగా చేయండి. Let us feel at home. ఇమిటేషన్ వద్దు.

–శ్రీబాబూజీ

సంపుటి : 21
సంచిక : 1

జనవరి 1
2018






# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

**- శ్రీబాబూజీ**

## లోపలి పేజీలలో

4 **పథగామి** - గురుకృప
6 **గురుకృప - మనోభూమి** - గురుకృప
9 **ప్రేమాలయం** - రూమీ
10 **అనన్యచింతన నీది...** - పార్థసారధి ప్రవచనాలు
15 **ఆనందపారవశ్యం - వ్యక్తీకరణ** - శరచ్చంద్రికలు
19 **గురుకృపాలహరి** - గురుకృప



నిర్వహణ : ***గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు***

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

ఏం చేయాలి అనేది **ప్రశ్న.** ఫలానా పని చేద్దాం అనేది **అనిపించడం.** ఆ పని చేయడమా- చేయకపోవడమా అనేది **పెనుగులాట.** చేయడం వలన వచ్చే లాభమేమి? చేయకపోవడం వలన వచ్చు నష్టమేమి అనేది **సమస్య.** ఆ పనిని చేయగలమా? చేయలేమా? అనేది **సందేహం.** ఆ పని చేస్తే ఎవరైనా ఏమైనా అనుకుంటారేమో-ఆ పని చేస్తే ఏమవుతుందో అనేది **భయం.** ఈ పనిని నేను చేస్తాను అని పదే పదే అనడం - **ఉబలాటం.** ఈ పనిని నేనే చెయ్యాలి (చేయగలను), ఇంకొకరు చేయలేరు అనేది **అహంకారము.** ఎవరో ఒకరు చేస్తారులే అనే తప్పించుకోవడం **బద్ధకం.**

**ప్రశ్నలోగాని, అనిపించడంలోగాని, పెనుగులాటలోగాని, సమస్యలోగాని, సందేహంలోగాని, భయంలోగాని, ఉబలాటంలోగాని, అహంకారంలోగాని, బద్ధకంలోగాని పరిపూర్ణ ఆచరణ కనిపించదు.** ఆచరణ లేనిదే పరిష్కారము జరగదు. మనిషి సమస్యలకు కారణం సక్రమంగా కార్యాచరణం చేయకపోవడం, కర్మాచరణం వలన కార్యసిద్ధి కలిగి సంసిద్ధత లభించును. ఏదో చేయాలి అని అనుకోవడం, అప్పుడున్న పనిని ఎగ్గొట్టడం, ఇంకో పనికి ఎగబ్రాకడం వలన ఏ పనీ పూర్తికాదు. బాబా అందుకే అనేవారు "ఒక పని మొదలుపెట్టాక - పూర్ణంగా చివరికంటా చెయ్యాలి, మధ్యలో విడిచి పెట్టకూడదు" అని.

ఏం చేయాలి? అనే ప్రశ్నలో 'పరిష్కారం' లేదు. చెయ్యడం మాని ఏం చెప్పినా 'శాశ్వతానందం' రాదు. నేను ఇది చేస్తాను అన్న నిర్ణయంలోనూ లేదు. కేవలం పని **చేయడంలోనే ఉంది.** అయితే నేను చేయడం లేదా! అనిపిస్తుంది. ఇది ఎవరికి వారే పరీక్షించుకోవాలి. అప్పుడు తెలుస్తుంది. బుద్ధిమంతుడైన మానవుడు స్వకర్మను సత్కర్మగా మలచి ఆచరించి సద్గురువు చేతిలో పనిముట్టు అవుతాడు-విశ్వకర్మలో భాగమవుతాడు.

**నిత్యజీవన యోగసాధన :**

మానవధర్మమును గ్రహించుచుండవలెను. ఉత్తమ మానవుల ప్రవర్తనను గమనించుచుండవలెను. సద్గ్రంథములను పఠించుచుండవలెను. అందలి సనాతన ధర్మమును స్మరించుకొనుచుండవలెను. ఎవ్వరినీ విమర్శించనక్కరలేదు. నిందించనవసరం లేదు. ధర్మపథమున (సాయిపథమున-



ఆనందపథమున) నడుచుటకు సంసిద్ధుడవు కావలెను. తనను సంస్కరించు విధానమును తెలుసుకొనుచుండవలెను. ఇతరుల లోపములను, దోషములను తొలగించే ప్రయత్నముకన్నా, తనలో తన లోపాలను తొలగించుకునే ప్రయత్నం చేయుచుండవలెను. నిత్య జీవనమున తాను చేయు కార్యక్రమాదుల యందు సంగమును విడిచి, సౌమ్యముగా, సవినయంగా ప్రవర్తించుట అభ్యసించవలెను. తనకు గురి కుదిరిన నామమునుగాని, ప్రార్థనను గాని, ధ్యానమునుగాని, పూజనుగాని అర్ధమెరిగి, సక్రమమైన మార్గమున ప్రతిదినము ఒకే సమయమునకు ఆచరించుట నేర్వవలెను. తనకు తృప్తినిచ్చెడు ఏదైనా సేవా కార్యమున తన దేహమును, మనసును, ఇంద్రియములను వినియోగించుచుండవలెను – లేదా చేయువారికి తోడ్పడుచుండవలెను. ఇలా ఆచరణ రూపమున స్థిరపడినవారు ఆదర్శవంతునిగా (తండ్రికి తగ్గ బిడ్డగా), కార్యోన్ముఖునిగా, నిత్యసంతుష్టినిగా జీవించగలరు.

సాధన అన్నది భగవంతుడు ఎక్కడో ఉన్నాడని తలచి ఆయన సాక్షాత్కారం కోసంకాక, నాలో, నీలో, అందరిలో, అంతటా, అన్నిటా వ్యాపించి ఉన్న ఆ భగవంతుని గుర్తించి, అనుగుణంగా వర్తించడం కోసమే అన్నది మరువరాదు.

సర్వసృష్టికర్త, జగత్పిత అయిన భగవంతుడు–కనిపించే బాహ్యపుష్పాలకన్నా అంతరంగంలో వికసించే అంతఃపుష్పాలను మెచ్చుకుంటాడు. మరునాటికి పసివాడే పుష్పాలను కాదు ఆయన ఆశిస్తున్నది. ఎన్నటికీ పసివాడని పుష్పాలను ఆయన కోరుచున్నది. ఇది తెలియాలి మన పుష్పార్చనలో. మనసు అనే పూదోటలో **అహింస, ఇంద్రియనిగ్రహం, క్షమ, సర్వభూతదయ, శాంతి, తపస్సు, ధ్యానం, సత్య ప్రవర్తనాదులనబడు అష్టవిధ పుష్పాలను పూయించుకోవాలి.** నిత్యజీవనంలో అట్టి ఏ ఒక్క పుష్పసమర్పణ (ఆచరణ)నైనా అమితానందంతో, ప్రీతితో స్వీకరిస్తాను అంటున్నాడు భగవంతుడు. "ఎవరైతే అంతటా, అన్నిటా నన్ను గుర్తించి, ఆ గుర్తింపుకనుగుణంగా వర్తిస్తారో, వారు నాకు ప్రీతిపాత్రులు" అన్నారు శ్రీసాయిబాబా. అలా నిన్ను ఆయనవాడిగా స్వీకరించి పూర్ణునిగా చేయదలచారు శ్రీసాయి. ఆచరణే నిజమైన అర్చన–ఆరాధన. ప్రేమపూర్వకమైన ఆచరణ శాశ్వత పరిణామమును కలిగించును. పరిణితిని సృష్టించును, పూర్ణునిగా నిలుపును. గురువు భావప్రియుడేకాని, బాహ్యప్రియుడుకాదు.

**– గురుకృప**



# గురుకృప - మనోభూమి

గురువు విత్తనాన్ని నాటతాడు, నీరు పెడతాడు, ఎరువు వేస్తాడు, అయితే భూమి సారవంతంగా ఉండాలి, బంజరు భూమిలో నాటే విత్తనాలు, పెట్టే నీరు, వేసే ఎరువు వృధా అవుతాయి. వారి జ్ఞానం మనకు వెలుగు, వారి జీవితం మనకు జవం, జీవం. వారి ప్రాణశక్తి (ఆచరణ, ఆదరణ), మనల్ని పోషించింది, పరిపాలించింది.

షేక్‌ఫరీదు వృత్తాంతం - ఒక నవయువకుడు తిరుగుతూ తిరుగుతూ ఒక చెట్టు దగ్గరకు వచ్చాడు. అక్కడ ఒక సాధువు కూర్చొని ధ్యానం చేస్తున్నాడు. ఆయనను కుదిపి, లేపి "బాబా! నన్ను భగవంతుని వద్దకు చేర్చండి" అని అడిగాడు. **"భగవంతుని వద్దకు చేర్చేవాడు గురువు"** అని ఆయన జవాబు చెప్పారు. "మరి నా గురువు ఎవరు"? "నేను గురుతు చెబుతాను వెదుక్కో" అన్నాడు సాధువు. "అలాగే గురుతు చెప్పండి" అన్నాడు ఫరీద్. "నీ గురువు ఒక చెట్టు క్రింద కూర్చొని ఉంటాడు. ఆయన ముఖం చుట్టూ కాంతివలయం ఉంటుంది. ఆయన కళ్ళు తేజస్సుతో వెలుగుతుంటాయి. ఆయన శరీరం నుండి పరిమళం వెలువడుతుంటుంది''. (చెట్టు-ప్రేమ, ఆకు-వెలుగు, ముఖం-జ్ఞానం, ఆత్మీయత- కృప, కరుణ, దయ, ఆనందం-కళ్ళు, ఆచరణ-శరీరం, శ్రద్ధ, సబూరీలు, లీలలో సర్వవ్యాపకత, సర్వజ్ఞత, సమర్ధత అనే పరిమళాలు) వెంటనే షేక్‌ఫరీద్ అన్వేషణకు బయలుదేరాడు. ("మీరందరూ నా నుండి విడివడ్డారు. మిమ్మల్ని నాలో కలుపుకోవాలనుకుంటున్నాను" అన్నారు బాబా. "బాబానే గురువు, సద్గురువు, అన్నీ ఆయనే. ఆయన పాదాలు పట్టిస్తాను" అన్నారు శ్రీబాబూజీ). రోజులు గడిచే కొద్దీ ఆయనలోని తపన తీవ్రతరం అయింది. ఆ సాధువు మాటపట్ల విశ్వాసం, శ్రద్ధ-సబూరీలే తపనగా వ్యక్తం అవుతున్నాయి. (విశ్వాసం-శ్రద్ధలే నాగలి, ఎడ్లు.) 20 సం॥లు గడిచాయి. కాని లభ్యం కాలేదు. తిరిగి తిరిగి మరలా ఆ సాధువు వద్దకు వచ్చాడు. 60 సం॥ల వయస్సులో ఉన్న సాధువు చుట్టూ కాంతివలయం, సుగంధం, ఇలా అన్ని లక్షణాలు కానవచ్చాయి-ఫరీద్‌కు. ఫరీద్ ఆయన కాళ్ళ మీద పడ్డాడు. సాధువు ప్రసన్నులై ఫరీద్ వీపు నిమిరారు. దేహం పులకరించింది. మనస్సు స్వాంతన పొందింది. ఆనందం, రక్షణల భావమే స్వాంతన. ఫరీద్ లేచి, సాధువుని 20సం॥ల పాటు నన్ను ఎందుకు త్రిప్పారు అని అడిగాడు. సాధువు ఇలా అన్నారు "అప్పుడు నా వద్దకు కుతూహలం, ఉద్భృతి కలిగిన



పిల్లవాడైన ఫరీద్ వచ్చాడు. ఇప్పుడు 20 సం॥ల అన్వేషణలో, తపనతో నిగ్గుతేలిన శిష్యుడు ఫరీద్ వచ్చాడు. నాయనా! గురువు శిష్యునికే దొరుకుతాడు. నీవు శిష్యుడివి కాగానే, నేను నీకు దొరికాను" అన్నారు! మన చెంతకు చేరిన సద్గురువును మనం ఎలా గుర్తిస్తున్నాం? ఎలా స్వీకరించాం? ఇలా ఫరీద్‌లో సంసిద్ధత, శ్రద్ధ, సబూరీ (ధైర్యోత్సవాలతో కూడిన సహనం) అనే మూడు గుణాలు ఏకమైనపుడు సారవంతమైన మనోభూమి సిద్ధమయింది. ఇది సార్వజనీనం. సద్గురులీలాగానం. అట్టి భూమిలో ప్రేమ, జీవితతత్త్వం పట్ల అన్వేషణ అనే విత్తనాలు నాటతారు గురువు. ఆ మనోభూమి ఆధ్యాత్మికత యొక్క దివ్య అవతరణను ధారణ చేయగలుగుతుంది. ఆ పాత్రతయే (ధారణే) శిష్యత్వం. గురువు దొరకడంలో కాక, ఆ పాత్రతను పెంచుకోవడంలో సమయం పడుతుంది. దానికి కంచెలాంటి సత్సంగం ఉపకరిస్తుంది. ఏకలవ్యుడు చేసిన ద్రోణాచార్యుని మట్టి బొమ్మ ద్రోణాచార్యునికన్నా గొప్ప పనిచేసింది. (భావనలే నిజమైన భూమిక.) అందుకే శ్రీసాయి అనేవారు "నా చిత్రానికి నాకు భేదం లేదు" అని "ముందు మన అవసరం ఏంటో మనకు తెలిస్తే సహాయం పొందే పద్ధతి దానంతనటదే వస్తుంది. దాని గురించి ప్రత్యేకంగా నేర్చుకోవాల్సిన పనిలేదు" అంటారు శ్రీబాబూజీ.

ఎంతో శ్రమించి, కష్టించి, సంపాదించిన దాన్ని పాత్రతలేని వ్యక్తి యొక్క విలాసాలకు, అహంకారానికి, దుబారాకు అందచేయడం జరగదు. తీసుకున్న వ్యక్తి యొక్క ప్రామాణికత ఏ స్థాయిదో, ఇచ్చే దానిని ఎలా సద్వినియోగ పరుస్తాడో తెలుసుకునే విజ్ఞత ఇచ్చే వ్యక్తికి ఉంటుంది.

ఆనందంగా స్వీకరించే శ్రద్ధ-సబూరీ (బాబాను తన గురువు తలక్రిందులుగా వ్రేలాడదీసినప్పటికీ) **ఏ పరిస్థితులలోనూ మారని స్థితి ఆనందం.** తనకు శిష్యరికం చేయాలని వచ్చిన వ్యక్తితో విజయకృష్ణ గోస్వామి ఇలా అన్నారు "12 సం॥ల పాటు గోవర్ధన పర్వతానికి నిర్విరామంగా ప్రదక్షిణలు చేసి, 13వ సం॥లో నా దగ్గరకు రా!" అంటే - అందుకు కారణం అడుగగా ఆయన ఇలా అన్నారు "12సం॥లపాటు తపించే ధైర్యం లేని వ్యక్తికి నా శిష్యుడయ్యే అర్హత లేదు" అని. 12సం॥ల పాటు నా గురువుని తదేకంగా చూస్తూ ఆకలిదప్పులు మరిచాను" అని చెప్పిన శ్రీసాయి మాటలే కదా ఏ పరిస్థితులలోనూ మారని ఆనందమంటే.

గురుశిష్య సంబంధం- రాగాత్మక సంబంధం. ప్రేమ, సంబంధాలకు అత్యున్నత ఆదర్శం. అంతా ఇవ్వాలి అనుకున్నది అజరామరమైన ప్రేమ సిద్ధాంతం. ప్రేమతత్వ సంవర్ధనా సాధన-గురుభక్తితో



**ఆవేశము తాత్కాలిక మార్పును కలిగించును.**



ప్రారంభమై, భగవత్ భక్తిగా పరిణమిస్తుంది. అట్టి ప్రేమతత్త్వ సాధన నిత్యకృత్య మయ్యేందుకు పూజ్యశ్రీబాబూజీ చూపిన బాట ఇదిగో – అవధరించండి.

"సరైన పద్ధతిలో బాబాను అంటిపెట్టుకోవడానికి మీరే మార్గాలను అన్వేషించుకోవాలి. ఊరకే అలా కూర్చొని కళ్ళు మూసుకోవడం మాత్రమే కాదు. కళ్ళు తెరచిన తరువాత మీరు ఏం చేస్తున్నారు? ప్రపంచంతో ఎలా వ్యవహరిస్తున్నారు? బాబాపట్ల మీరు ఎలా ప్రతిస్పందిస్తున్నారు? సత్సంగంలో మీ ఉద్దేశ్యాలను ఎలా పంచుకుంటున్నారు. వీటన్నింటి గురించి మీరు సరిచూసుకోవాలి. దానికి అనుగుణంగా పరిస్థితులను మలచుకోండి. ఈ జీవితం ఒక నవలవంటిది. ఓ అందమైన నవల! దీనిని బాబా వ్రాసారు. మన జీవితానికి రచయిత ఆయన. దానిని చదవడానికి, ఆస్వాదించడానికి ప్రయత్నించండి. దానిని పాఠ్యపుస్తకం చేయకండి" అంటారు శ్రీబాబూజీ.

**శ్రీబాబూజీ అస్యూరెన్స్ :** "హ్యాపీగా బాబాను పట్టుకోండి. చక్కగా బాబాను చూపించాను. బాబా తత్త్వమేమిటో చెప్పాను, పట్టుకోండి. మిమ్మల్ని ఎలా తీసుకుపోవాలో నాకు తెలుసు. చక్కగా ఉండండి. మీకేమీ లోటు రాదు. నేను చెబుతున్నాను కదా! ఆ అస్యూరెన్స్ కూడా నేను ఇస్తున్నా.. మీకెందుకు...

చక్కగా బాబా మీద ఫోకస్ చేయండి అయితే ఆ అస్యూరెన్స్ మీరు నాకివ్వాలి. బాబా, బాబా, బాబా అంతే వేరే ఏదీ ఉండకూడదు మన(సు)లో.

లైఫ్ అంతా కూడాను మన జీవితంలో బాబా యొక్క సత్సంగం అనేటువంటిది ఒక భాగం కావడం కాదు. ఆయన యొక్క లీలా ప్రబోధం–దానికి మన జీవితమే ఒక భాగం కావాలి. అలా ప్రయత్నం చేయండి. బాబా చూసుకుంటారు" అంటారు పూజ్యశ్రీ బాబూజీ. మన ఆరాధ్యుని కోసం, వారి ఆదర్శాల కోసం సర్వస్వాన్ని సమర్పిద్దాం. అలా అయినప్పుడు మన అంతఃకరణం దివ్యానందంతో పొంగి పొరలుతుంది.

**–గురుకృప**

ఆవగింజంత విశ్వాసం ఉంటే ఒక కొండను ఇక్కడినుండి అక్కడకు కదిలించవచ్చునని, విశ్వాసం ద్వారా అసాధ్యమైనదేదీ లేదు. మనిషి (దైవం) సద్గురువుతో సంపూర్ణంగా 'కనెక్ట్' (Constant Touch) అయినప్పుడు కలిగే మహత్తరమైన శక్తి విశ్వాసం. విత్తనం మొలకెత్తాలంటే అది నేలలో పడాలి, అక్కడ దానికి తేమ తగలాలి. తర్వాత సూర్యరశ్మి రావాలి. అలా విశ్వాసిలోని సంపూర్ణ సంసిద్ధత, దైవంపట్ల తిరుగులేని విధేయతలే అతనిలో విశ్వాసంగా మొలకెత్తి వృద్ధి చెంది, ఫలించేందుకు దోహదం చేస్తాయి అంటారు జీసస్.



# ప్రేమాలయం

నా జీవితారంభం నుండి
నీ మోము చూడాలని పరితపిస్తున్నా...
చివరకు నేటికి నీ మోముని చూశా..

నేను అన్వేషిస్తున్న సౌందర్యాన్ని
ముగ్ధమైన సమ్మోహన రూపాన్ని
అగాధమైన ఆకర్షణగల వదనాన్ని
ఈనాటికి చూశా..

ఈ రోజున నిన్ను తెలుసుకున్నా...
నిన్న నన్ను హీనంగా చూసి నవ్వుకున్నవాళ్ళు
నాలాగా వెదకనందుకు చింతిస్తున్నారు

దివ్యమైన నీ సౌందర్యానికి దిగ్భ్రమ చెందాను
వేయికళ్ళతో నిన్ను వీక్షించాలని అభిలషిస్తున్నాను.

నా హృదయం ఉద్వేగంతో దహించుకుపోయింది
నేనిప్పుడు వీక్షిస్తున్న ముగ్ధమైన సౌందర్యానికై
నా హృదయం ఎప్పుడూ వెదుకుతూనే ఉంది.

దీనిని ఐహికమైన ప్రేమ అని అనడానికి సిగ్గుపడుతున్నా..
దీనిని దైవికమైనదని అనడానికి భగవంతునికి భయపడుతున్నా...

పరిమళమైన నీ శ్వాస స్తబ్ధుగా
ఉన్న ఉద్యానవనానికి
ఉదయసమీరంలో వచ్చింది...
నీవు క్రొత్త జీవితానికి నాలో ఊపిరులూదావు

నేను నీ
వెలుగుగా నీ నీడగా పరివర్తనం
చెందాను.

నా అంతరాత్మ ప్రసరించే
దేదీప్యమైన తేజస్సు
నా ఎదలో జ్వాలను వెలిగించింది.
అదే నాకు అవని – ఆకాశం.

నా ప్రేమబాణం (అమ్ము)
లక్ష్యానికి చేరువైంది
నేను కరుణాలయంలో ఉన్నా...
నా హృదయం
ప్రార్థనాలయమైంది.

– రూమీ



## అనన్యచింతన నీది - యోగక్షేమాలునావి!

**అనన్యా శ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే ।**

**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥**

ఎవరు నన్ను అనన్యచింతన కలిగి ఆరాధిస్తారో, వారు నిత్యాభి యుక్తులవుతున్నారు. అట్టి వారి యోగక్షేమాలను నేను చూచుకొంటాను. ఆ బాధ్యతను నేను వహిస్తాను. తమను గూర్చి తాము ఆలోచించుకోవలసిన స్థితి అన్నది వారికి లేకుండా, రాకుండా నేను కాచుకొంటాను. అనన్యచింత అంటే ఏమిటి? 'నేను' తప్ప అన్యములేదని అనుభవానికి రావడం. ఆచరణలో ఆ అనుభూతి అఖండంగా నిలబడటం.

మామూలుగా లోకంలో ఆనన్యచింత అన్నప్పుడు దేవతామూర్తులలోనో, మహనీయులలోనో ఏదో ఒక మూర్తిని విశ్వసించి, ఆ మూర్తిని మాత్రమే స్మరిస్తూ, ఆ అర్చనలో పాల్గొంటూ ఉండటమనే అర్థం ఉన్నది. అలా తమకు నచ్చిన మూర్తిముందు కూర్చుండిపోయేవారు కూడా ఉన్నారు. ఆ స్మరణలో వీలైనంత ఎక్కువసేపు ఉండిపోయే వారు కూడా ఉన్నారు. ఇది చింతనకు ప్రారంభమవుతుంది గాని అనన్యచింతన అంటే ఇది మాత్రమే కాదు. ఇంతమాత్రమే కాదు.

దేవతామూర్తులలోగాని, దేవుని అంశతో దిగివచ్చిన మహనీయులలోగాని మనకు నచ్చిన మూర్తిని మనం స్మరించవచ్చు. మన మనసు మెచ్చిన మూర్తిని మనం ఉపాసించవచ్చు. అయితే ఆ అర్చన క్రమంగా అనన్యచింతనగా రూపొందాలి. ఆ మూర్తినే మనం అంతటా చూడగలగాలి. అన్నిటా చూడగలగాలి. సకల దేవతామూర్తులలోను మహనీయులలోను మనకు నచ్చిన ఆ మూర్తి మనకు పొడగడుతూ ఉండాలి. అతడు, మిగిలిన వారు అన్నభావన మనకుండకూడదు. ఆ భావన రాకూడదు. నిజానికి మిగిలినవారు అన్నవారులేరు. అలామిగలరు. అది మన భావన మాత్రమే.

సృష్టి అంతా భగవానుని రూపమే! సృష్టికి అవతల, ఇవతల కూడా ఉన్నది ఆతడే! అతడు అనంతుడు, ఆద్యంతాలు లేనివాడు. సృష్టియంతా అతని రూపమే కనుక సృష్టిలోని ఏ రూపాన్నయినా మనం అతని ప్రతీకగా, ప్రతినిధిగా స్వీకరించవచ్చు. ఆ మూర్తిని, ఆ నామరూపాలను దైవస్వరూపంగా మనం ఆరాధించవచ్చు. అలా మన ఆరాధనను ప్రారంభించవచ్చు. అయితే అది ప్రారంభం మాత్రమే అని మనం గుర్తెరిగి ఉండాలి. ఒకసారి ప్రారంభమైన తరువాత అది ముందుకు సాగాలి. అనగా ఏ



మూర్తిని మనం ఉపాసిస్తున్నామో ఆ మూర్తిని మనం అంతటా చూడగలగాలి. ఆ మూర్తిలో మనం అంతటినీ చూడగలగాలి. ఆ మూర్తికానిది ఇంకేమీలేదు. అన్న అనుభూతి మనకు కలిగి స్థిరపడాలి. అప్పుడు అనన్యచింతన అవుతుంది. ఉన్నది ఒక్కడే–అన్యములేదు. అనగా ఇతరమన్నది ఇకలేదు అని స్పష్టమవుతుంది.

ఇలాంటి ఈ ఉపాసన ఏ కొద్దిసేపో నిర్వహించబడవలసినదికాదు. దేవుని ముందు కూర్చున్న ఆ కాసేపు ఇలాంటి అనుభూతి కలిగితే చాలదు. దేవునిముందు కూర్చోవటం, దేవతార్చన అన్నది ఉపాసనకు దోహదం కావాలి తప్ప ఉపాసన అంటే అది మాత్రమే కారాదు. ఇది నిరంతరం సాగాలి. అఖండంగా సాగాలి. కనుకనే జరుగవలసినది పర్యుపాసనము అని చెప్పబడినది. **జీవితంలో ఉపాసనకాదు. జీవితంతో ఉపాసన జరగాలి. ఉపాసనలో మన జీవితం నడయాడాలి. మన జీవితమే మన ఉపాసన కావాలి. మన జీవితమే ఒక దేవతార్చనగా రూపొందాలి. జీవిత నిర్వహణమే దేవునకు ఒక నిండైన పూజ కావాలి.** మనం చేసే నిత్యదేవతార్చన, అనుష్ఠానం అందుకు కావలసిన దోహదాన్ని మనకు అందించాలి. అందుకు కావలసిన నేపథ్యాన్ని మనకు రూపొందించాలి. అందుకు కావలసిన శిక్షణను మనకు అనుగ్రహించాలి. అనన్యచింతన అనేది ఎలా జరగాలి అన్నది భాగవతంలోని ప్రహ్లాదుని చరిత్రలో మనకు చక్కగా ఉపదేశింపబడింది. దినచర్యను దైవారాధనగా రూపొందించుకోవడమన్నది ఎలాగో ప్రహ్లాదుడు మనకు చూపిస్తున్నాడు చూడండి.

**పానీయంబులు ద్రావుచున్ కుడుచుచున్ భాషించుచున్ హాసలీ**
**లానిద్రాదులు జేయుచున్ దిరుగుచున్ లక్షించుచున్ సంతత**
**శ్రీ నారాయణ పాదపద్మయుగళీచింతామృతాస్వాద సం**
**ధానుడై మఱచెన్ సురారి సుతుడే తద్విశ్వమున్ భూవరా!**

పానీయస్వీకరణలో దాహము తీరుతున్నవేళ దైవమే అతడికి గోచరిస్తున్నాడు. దైవమే పానీయమై, దాహాన్ని తీర్చి, ఇలా దేహాన్ని నిలబెడుతున్నాడు–అన్న గమనికను అతడందుకొంటున్నాడు. ఆహార స్వీకరణలో ఆకలి తీరుతున్న వేళ ఆ దైవమే అతడికి గోచరిస్తున్నాడు. ఆకలి అతడే, ఆకలికి అన్నము అతడే, తింటున్నది అతడే, రుచిగా అనుభవానికి వస్తున్నది కూడా అతడే. వీటన్నింటి ద్వారా దేహాన్ని పోషిస్తున్నదీ అతడే. దేహమూ అతడే. ఇలా అన్నిటా అతడే గోచరిస్తున్నాడు. అన్న పానాల



స్వీకరణ అర్చన అవుతున్నది. ఒక యజ్ఞవిశేషమవుతున్నది.

కర్తవ్య నిర్వహణలో భాగంగా అతడు సంభాషణలు జరుపుతున్నాడు. అలా మాట్లాడేటప్పుడు కూడా మాటమాటలో, మాటమాటకు దైవమే అతడికి అనుభవానికి వస్తున్నాడు. మాట్లాడుతున్నది దైవము. మాటలు, దైవము ఎవరితో మాట్లాడుతున్నాడో వారు దైవము, అంతటా దైవమే అతడికి అనుభవానికి వస్తున్నాడు. ఇలా జీవన వ్యాపారమే ఒక ఆరాధనా విశేషంగా రూపుదిద్దుకొంటున్నది.

అర్చన అన్నది తీవ్రంగా సాగనక్కరలేదు, భయపడుతూ చేయనక్కరలేదు. మామూలు మాటల్లో చెప్పాలంటే మనం సీరియస్‌గా ఉండనక్కరలేదు. ఆడవచ్చు, పాడవచ్చు, హాయిగా ఉండవచ్చు, లీలగా వర్తించవచ్చు, ముచ్చటగా ప్రవర్తించవచ్చు. అంతేగాని మూతిముడుచుకొని, నొసలు చిట్లించుకొని, తోటి వారికి జంకు కలిగేటట్లుగా ప్రవర్తించటం అర్చనకాదు. పవిత్రత పేరిట బిగుసుకుపోవడం అర్చన కాదు. అది తెలియజెప్పడానికే ప్రహ్లాదుని చరిత్రలో, "హసలీలా నిద్రాదులు సేయుచున్" అని చెప్పబడింది. సందర్భాన్ని బట్టి అతడు నవ్వుతున్నాడు. లీలగా వర్తిస్తున్నాడు. కాని అప్పుడు కూడా, అందులో కూడా ఆ దైవాన్నే అతడు అనుభవిస్తున్నాడు. దైవమే చిరునవ్వయి అతడి పెదవుల నుండి పూస్తున్నాడు. నవ్వుల పువ్వులను విరజిమ్ముతున్నాడు. దైవమే తన లీలను అతడి నుండి చూపుతున్నాడు. అవలీలగా, 'అతని' లీలగా కర్తవ్య నిర్వహణ సాగిపోయేట్లు చూస్తున్నాడు. కనుక నవ్వులూ అతడే. లీలలూ అతడే! ఆ మధ్యలో విశ్రాంతినందించే నిద్రకూడ అతడే. అలసిన శరీరాలకు, ఇంద్రియాలకు, మనస్సుకు నిద్రరూపంలో అతడు విశ్రాంతినిస్తున్నాడు. సేద తీరుస్తున్నాడు. మరునాడు పనిచేయడానికి కావలసిన శక్తియుక్తులను సంతరించి పెడుతున్నాడు. నిద్రనుండి లేచేటప్పటికి దివ్యమయిన తాజాదనాన్ని అతడు అనుభవానికి తెస్తున్నాడు. ఒక ఉత్తేజం, ఒక ఉత్సాహం పొంగుకొచ్చేలా చేస్తూ, కర్తవ్య నిర్వహణ యెడల కావలసిన ఉన్ముఖత్వాన్ని కలిగిస్తున్నాడు. నిత్య నూతన స్థితిలో మనను నిలబెడతున్నాడు చూశారా! నిద్రలో నిద్రగా అతడెంత చేస్తున్నాడో! కనుక నిద్రలో కూడా అతడే అనుభవానికి వస్తున్నాడు అంటున్నాడు ప్రహ్లాదుడు.

నిద్రలో మనం గమనించవలసిన సూక్ష్మం మరొకటి ఉంది. మనం నిద్రపోతునప్పుడు మనలో కొంతభాగం విశ్రాంతి తీసికొంటుంది. కొంతభాగం పనిచేస్తూనే ఉంటుంది. మనస్సు, ఇంద్రియాలు విశ్రాంతిని తీసికొంటున్నాయి. గుండె, ఊపిరితిత్తులు మొదలయిన దేహభాగాలు పనిచేస్తూనే

ఉంటాయి. మనస్సు, ఇంద్రియాలు మానవరాజ్యం అనబడతాయి. ఆ వెనుకన విశ్రాంతి కోరని రాజ్యమున్నదే అది దేవునిరాజ్యం. నిద్రలో జరుగుతున్నది ఏమిటి అంటే మానవరాజ్యం దేవునిరాజ్యంలో కరిగిపోతున్నది. మళ్ళీ మెలకువ వచ్చినప్పుడు మానవరాజ్యం దేవునిరాజ్యం నుండి ఈవలకు వ్యక్తమవుతున్నది. ఇది ఒక దివ్యమైనస్థితి. దివ్యమైన అనుభూతి. ఇటువంటి స్థితి మనం మేల్కొని ఉండగా అనుభవానికి వచ్చిందనుకోండి. అదే మోక్షస్థితి, తురీయస్థితి. దానినే మనం సమాధి అంటున్నాం. నిద్రలో అనుభవానికి వస్తున్నదేదో అది మేల్కొని ఉండగా కూడా అనుభవానికి రావాలి. అంత హాయి అనుభవానికి వస్తుండగా దినచర్య దేవతార్చనగా సాగాలి. మానవరాజ్యం దేవుని రాజ్యంతో శ్రుతికలిసి దానితో తాదాత్మ్యం చెందుతూ ఆ తాదాత్మ్యస్థితి నుండి దినచర్యను ఒక ధ్యానంగా, ఒక గానంగా వ్యక్తం చేయగలగాలి. వీణనుండి వీణాగానం వ్యక్తమైనట్లు, దేహంమీదుగా కర్మ సంగీతం వ్యక్తం కావాలి. ఆ కర్మ సంగీతం సృష్టిగానంతో శ్రుతికలపాలి అప్పుడది వేదమవుతుంది. నాదమవుతుంది. వేదనాదమవుతుంది. నిద్రలోకూడా అతడినే చూడగలిగినప్పుడు అటుపైన అతడునుగ్రహించే దివ్యస్థితి ఇలా ఉంటుంది.



ఇంకా ప్రహ్లాదుడు ఎలా ఉపాసిస్తున్నాడు. 'తిరుగుచున్, రక్షించుచున్'... అనగా అతడు ఉపాసనపేరిట ఒకచోట కూర్చుండిపోవటం లేదు. నిరంతరం కర్తవ్యశీలియై ప్రవర్తిస్తున్నాడు. ఆ కర్తవ్య నిర్వహణలో వివిధములయిన రాకపోకలు చేస్తూనే ఉన్నాడు. ఆ రాకపోకలన్నింటిలో అతడు దైవాన్నే అనుభవిస్తున్నాడు. ప్రతి కదలికలోనూ అతడికి పరమాత్మే గోచరిస్తున్నాడు. మానవుని కదలికలే దేవుని కథానికలు – అన్న అనుభూతి అతనికి నిరంతరం అందివస్తూ ఉన్నది.

అలాగే ఇది చేయవలసిన పని – అని ఒక పనివైపు చూస్తున్నప్పుడు, ఇతడితో మాట్లాడవలసి ఉన్నది అని ఒక వ్యక్తితో మాట్లాడవలసి వచ్చినప్పుడు అతనికి దైవమే గోచరిస్తున్నాడు. రక్షించుచున్ – అన్నమాటకు అర్థమిది. ఇది చూపుతాకిన చోట చొక్కముగా నీవే అంటూ అతడు దేనిని చూస్తున్నా. దేనిని గుర్తిస్తున్నా, దేనివైపు చూస్తున్నా, దేనిని చూపెడుతున్నా అక్కడ దైవమే పొడగడుతున్నాడు, పనిని చేస్తున్నవాడు. ఆ పనియొక్క ఫలితాన్ని అందుకొంటున్నవాడు, జరుగుతున్న పని – అంతటా దైవమే! కర్త, కర్మ, క్రియ – మూడింటా ఉన్నది దైవమే! పని జరగడం కొరకు అతడలా ఉంటున్నాడు. చూస్తున్నవాడు, చూడబడుతున్నవాడు, చూడడమూ – మూడూ దైవమే! సృష్టి కథ



కొరకు అతడలా మూడుగా కనబడుతున్నాడు. కథ నడుస్తూనే ఉండాలి! అంతటా, అన్నిటా అతడు మనకు గోచరిస్తూనే ఉండాలి. అప్పుడు ఈ విశ్వం యొక్క రూపం భగవానుని విశ్వరూపమవుతుంది. విశ్వం స్థానంలో మనకతడే కనబడతాడు.

ఒక రోడ్డు వెంట సామాన్యస్థితిలో ఉన్న మానవుడూ, ఆ ప్రక్కనే రామకృష్ణ పరమహంస కలసి నడుస్తున్నారనుకోండి, సామాన్యస్థితిలోనున్న మానవునికి ప్రపంచము, దాని పోకడలూ కనిపిస్తాయి. రామకృష్ణ పరమహంసకు దైవము, అతని లీలలూ గోచరిస్తాయి. ఇద్దరూ ఒకే రోడ్డుపైన నడుస్తున్నారు. ఒకే విశ్వంలో నడయాడుతున్నారు. కాని ఎవరి దర్శనం వారిది. ఒకరికది విశ్వం. మరొకరికది దైవం. అనన్యచింతనయొక్క ఫలితం ఇలా ఉంటుంది. ఇంత వరకూ చెప్పుకొన్నట్లుగా అనన్యచింతన సాగవలసి ఉంటుంది. కాకినాడకు దగ్గర ప్రాంతంలో ఒకామె ఉంది. ఆమెకు దైవభక్తిమెండు. ఆ ఊరిలో ఒక దేవాలయముంది. ఆ దేవాలయంలోని దేవుని మూర్తి అంటే ఆమెకు ఎనలేని ఇష్టం. దానితో తరచుగా ఆమె ఆ దేవాలయానికి వెళుతూ ఉండేది. ఒక రోజులోనే చాలాసార్లు వెళ్ళివస్తూ ఉండేది. క్రమంగా రోజు మొత్తం మీద ఇంటిలో ఉండే సమయం కన్నా, గుడిలో ఉండే సమయం పెరిగిపోయింది.

పొయ్యిమీద బియ్యం కడిగిపెట్టి, కూరలు, పులుసులూ కూడా పెట్టి గుడికి వెళ్లిపోయేది. ఇప్పుడే వచ్చేద్దాంకదా అనుకొనేది. గుడిలో అలా కూర్చుండిపోయేది. పొయ్యిమీద పదార్థాలు మాడిపోయేవి. ఇంటిలో భర్తా, పిల్లలూ అల్లాడిపోతూ ఉండేవారు. వారికేం చేయాలో తోచేది కాదు. ఆమెను ఔననలేరు, కాదనలేరు. అయోమయస్థితిలో పడిపోయారు. నచ్చచెప్పడానికి ప్రయత్నించినా పెద్ద ప్రయోజనం ఉండేదికాదు. అంతా ఆమె తెలిసి చేయడం లేదుకదా! కూర్చుండిపోదామని వెళ్లడం లేదావిడ! కాని కూర్చుండిపోతోంది. ఒకసారి వెళ్ళిన తరువాత కదలలేకపోతోంది. దానితో మిగిలిన దినచర్య కుంటుపడుతోంది. కర్తవ్య నిర్వహణలో అనిశ్చితస్థితి చోటు చేసికొంటోంది. బంధుమిత్రులు తట్టుకోలేకపోతున్నారు. కాని, చేయగలిగినది లేదు. ఒక ప్రక్క వారి దినచర్యలు దెబ్బ తింటున్నాయి. కుటుంబ జీవనం దారి తెన్నును కోల్పోతోంది. రెండవ ప్రక్క ఆమె ఏమయిపోతుందోనన్న ఆందోళన వారిని బాధిస్తోంది.

***(మిగతా 26వ పేజీలో)***

**చేయదలచిన దానిని వెంటనే చేయడమే - సుఖం.**

# ఆనందపారవశ్యం - వ్యక్తీకరణ



**గురువుగారు :** అడవిలో సాధువు గురించిన ఒక కథంటే నాకు చాలా ఇష్టం. దాన్ని మీకు నేను చాలాసార్లు సత్సంగాలలో చెప్పాను కదా, మీకది గుర్తుందా? విష్ణుమూర్తి సాక్షాత్కారం పొందాలని హృదయంలో ఎంతగానో తపన ఉన్న ఒక వృద్ధ సాధువు ఉండేవాడు. దాంతో అతను శాస్త్రాలలో చెప్పిన విధంగానే అడవిలోకి వెళ్ళి ఓ చెట్టు క్రింద కూర్చొని తపస్సు చెయ్యడం మొదలుపెడతాడు. ఇంద్రియాలను నిగ్రహించి, ఏకాగ్రచిత్తంతో, తదేకదృష్టితో హఠయోగం, రాజయోగం, ఆత్మవిచారం ఇటువంటివన్నీ చేస్తుంటాడు (గురువుగారు నవ్వుతూ...), చాలా పట్టుదలతో తాను చదివిన వాటిని, విన్నవాటినన్నింటినీ చాలా శ్రద్ధగా సాధన చేస్తూ ఉంటాడు. ఒకరోజు నాదబ్రహ్మ నారదమహర్షి ఆ త్రోవలో పోతూ ఈ సాధువును చూడటం జరుగుతుంది. ఎందుకనో నారదమహర్షికి అతన్ని చూడగానే అతనిపట్ల ఇష్టం కలుగుతుంది. అందుకని ఇతని దగ్గరకు వచ్చి, "నాయనా, ఎవరు నువ్వు? ఎక్కడ నుండి వచ్చావు? ఏం చేస్తున్నావు?" అని అడుగుతాడు. నారదుల వంటి మహర్షుల దర్శనభాగ్యం కలిగినందుకు ఆ సాధువు చాలా సంతోషించి, తన వివరమంతా నారదమహర్షికి చెప్తాడు. నారదుడు సంతసించి, "మంచిది, నీకేదైనా కోరిక ఉందా?" అని అడుగుతాడు. దానికి సాధువు "ఓ నారదా, నాకేమీ అవసరం లేదు. కానీ నాది ఒకే ఒక చిన్న విన్నపం. మహర్షీ, మీరు ఈసారి విష్ణుధామమైన వైకుంఠానికి వెళ్ళినపుడు, ఆ స్వామిని నాకు వారు దర్శనం ఎప్పుడు అనుగ్రహిస్తారో కాస్త కనుక్కుని, తరువాత మీకు వీలైనప్పుడు నా వద్దకు వచ్చి ఆ సమాధానాన్ని నాకు తెలియచేయవలసింది" అని కోరతాడు. దానికి నారదుడు, "ఆహా! దానికేముంది, ఇది చాలా చిన్న విషయం, తప్పకుండా! దీని గురించి ఆందోళన చెందవద్దు, నేను చూసుకుంటాను" అని చెప్పి, అక్కడి నుండి వెళ్ళిపోతాడు.

కొన్ని సంవత్సరాలు గడిచిపోతాయి. నారదుడు ఈ విషయం పూర్తిగా మరచిపోతాడు. ఆ తర్వాత ఒకసారి నారదుడు వైకుంఠానికి పోవడం తటస్థిస్తుంది. విష్ణుమూర్తితో ఆ మాటా, ఈ మాటా మాట్లాడుతూ ఉన్నప్పుడు ఉన్నట్టుండి నారదుడు విష్ణుమూర్తిని, "స్వామీ, నేను మిమ్మల్ని ఓ విషయం అడగడం మర్చిపోయాను, చాలా రోజుల క్రితం నేను దీనుడైన ఒక సాధువును కలిశాను, అతను చాలా తీవ్రంగా తపస్సు చేస్తున్నాడు, అతను చాలా శ్రద్ధాసక్తులు ఉన్నవాడు, నాకు చాలా బాగా నచ్చాడు, అతనికి మీరెప్పుడు దర్శనం ఇస్తారో తెలుసుకోవాలనే చిన్న ప్రశ్న ఉంది" అని విన్నవిస్తాడు.



దానికి విష్ణుమూర్తి “అయ్యో నారదా, దానికి చాలాకాలం పడుతుంది. అతను కూర్చున్న చెట్టుకు ఎన్ని ఆకులున్నాయో అన్ని జన్మల తరువాతనే, అంటే కొన్ని వేల జన్మలు ఎత్తిన తరువాతగానీ అతనికి నేను దర్శనం ఇవ్వడం జరుగదు” అంటాడు. అప్పుడు నారదుడు “అయ్యో, అతను చాలా మంచివాడే” అని విచారం వ్యక్తం చేస్తాడు. “ఏం చేస్తాం నారదా, అతని ప్రారబ్ధం అంత ఉంది. నేను చెయ్యగలిగింది ఏమీ లేదు” అంటాడు విష్ణుమూర్తి. “సరే స్వామీ, మీ చిత్తానుసారమే కానివ్వండి” అని చెప్పి నారదుడు బయలుదేరుతాడు.

ఆ తరువాత కొంతకాలానికి నారదుడు అడవిలో ఆ సాధువుకు సమీపంలో అంతకుముందు వెళ్ళిన దారిలోనే పోతుంటాడు. నారదుడు ఆ సాధువును చూస్తాడు. అతనికి ఆ దుర్వార్త చెప్పడం ఎందుకని అతన్ని చూసీచూడనట్లు అలా వెళ్ళిపోతుంటాడు. కానీ ఆ సాధువు నారదుణ్ణి చూసి పరుగెత్తుకుంటూ వచ్చి, “ఇదేమిటి మహర్షీ నాకు దూరంగా వెళ్ళిపోతున్నారు, నేను చేసిన తప్పేమిటి? క్రిందటిసారి నేను అడగకుండానే మీ దర్శనాన్ని ప్రసాదించారు, కానీ ఈరోజు మీరు అసలు నన్ను పట్టించుకోకుండా దూరంగా వెళ్ళిపోతున్నారెందుకు?” అని ప్రశ్నిస్తాడు. దానికి నారదుడు “లేదు, అటువంటిదేం లేదు, నీ పట్ల నాకు కోపమేమీ లేదు. కాస్త తీరుబడి లేదు, అంతే. ఏంటి ఎలా ఉన్నావు, అంతా బాగుందా?” అని అడుగుతాడు. “అంతా బాగానే ఉంది స్వామీ, మరి నా ప్రశ్న ఏమైంది స్వామీ” అని విషయానికి వస్తాడు ఆ సాధువు. అప్పుడు నారదుడు, “దాని గురించి ఆందోళనపడవద్దు, నువ్వు సరిగ్గానే చేసుకుంటున్నావు, అలాగే చేసుకుంటూ ముందుకెళ్ళు, విష్ణుమూర్తి నిన్ను తప్పక అనుగ్రహిస్తాడు, ఆయన అనుగ్రహం ఎప్పుడూ నీతోనే ఉంది. నువ్వు బాగా చేసుకుంటున్నావు. ఇలాగే చేసుకో” అని అంటాడు. అయితే ఆ సాధువు, “మహర్షీ, మీరు నా ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిందే” అని పట్టుబడతాడు. విష్ణుమూర్తి చెప్పిన దానిని అతనికి చెప్పి నిరుత్సాహపరచడం ఇష్టం లేక నారదుడు మళ్ళీ “నువ్వు దాని గురించి ఆలోచించవద్దు, ఇలాగే చేసుకుంటూ ముందుకెళ్ళు” అని తప్పించుకోచూస్తాడు. కానీ ఆ సాధువు ఎంతకీ పట్టు వదలకపోయేటప్పటికి ఇక నారదునికి విషయం చెప్పక తప్పదు. నారదుడు అతనితో, “నేనేం చెప్పేది నాయనా, నువ్వు కూర్చున్న ఈ చెట్టుకు ఎన్ని ఆకులున్నాయో అన్ని జన్మలెత్తిన తరువాతగానీ నీకు సాక్షాత్కారం లభించదని విష్ణుమూర్తి చెప్పాడు” అని చెప్తాడు.



ఇలా ఈ విషయం అతనికి చెబుతున్నప్పుడు నారదుడు మనస్సులో "భగవంతుడా, ఈ విషయం వినగానే ఇతని గుండె బ్రద్దలైపోతుంది" అనుకుంటాడు. కానీ అత్యంత ఆశ్చర్యం గొలిపేలా, ఆ సాధువు ఈ విషయం వినీ వినగానే చెప్పరాని ఆనందంతో, పారవశ్యంతో, "ఆహా! నాకెంతో ఆనందంగా ఉంది, విష్ణుమూర్తి నాకు సాక్షాత్కరిస్తానని హామీ ఇచ్చారు, నాకు స్వామి దర్శనాన్ని అనుగ్రహించబోతున్నారు" అని పెద్దగా అరుస్తూ, ఆనందంగా నృత్యం చేయడం మొదలుపెడతాడు.

అతను అలా నాట్యం చేస్తున్నప్పుడే, అదే క్షణంలో వైకుంఠం నుండి విష్ణుమూర్తి వచ్చి, అతనికి దర్శనం ఇస్తాడు. ఈ పరిణామంతో నారదుడు మరింత ఆశ్చర్యపడటంతోపాటు చిన్నబుచ్చుకుంటాడు. (గురువుగారు నవ్వుతూ) విష్ణుమూర్తి ఆ సాధువుకు దర్శనం ఇవ్వాలని నారదుడు మనస్ఫూర్తిగా కోరుకున్నాడు, కానీ కొన్ని వేల జన్మ తరువాతగానీ అది సాధ్యం కాదన్న విషయం అతనికి చెప్పిన తరువాత అప్పటికప్పుడు విష్ణుమూర్తి అతనికి దర్శనం ఇవ్వడంతో నారదుడు తాను వెర్రివాడినైపోయానని అనుకున్నాడు (గురువుగారు నవ్వుతూ)

ఆ తరువాత నారదుడు, విష్ణుమూర్తి కలసి అక్కడినుండి బయలుదేరి వెళుతున్నప్పుడు నారదుడు తట్టుకోలేక విష్ణుమూర్తితో, "స్వామీ, మీరు చేసిందేమిటి? ఆ సాధువు ముందు నన్ను వెర్రివాణ్ణి చేసారు. స్వామీ! మీరే కొన్ని వేల జన్మల తరువాతగానీ అతనికి దర్శనం ఇవ్వనని చెప్పారు, నేనతనికి అదే చెప్పాను. ఉన్నట్లుండి మీరు అతనికి సాక్షాత్కరించారు, అతడు నా గురించి ఏమనుకుంటాడు" అని మొరపెట్టుకుంటాడు (గురువుగారు నవ్వుతూ)? దానికి విష్ణుమూర్తి "నారదా నేనేం చేసేది, అతని ప్రారబ్ధానుసారం నేను అతనికి సాక్షాత్కరించడానికి అతను చాలా జన్మలు ఎత్తవలసి ఉంది, కానీ నువ్వు అతనికి అన్ని జన్మల తరువాతైనా నేను దర్శనం ఇస్తాను అని చెప్పిన మరుక్షణం, **నా సాక్షాత్కారం లభిస్తుంది అన్న హామీ అతనికి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఆ పారవశ్య స్థితిలో ఎన్నో జన్మల ప్రారబ్ధకర్మ దహించుకుపోయింది,** (నిరంతరం ఆనందంగా ఉండటంలో ఉపయోగం) అతను దర్శనానికి సంసిద్ధుడయ్యాడు – అందుకనే నేను తక్షణం సాక్షాత్కరించవలసి వచ్చింది. అది నా చేతులలో లేదు, నేనేం చేసేది? (గురువుగారు నవ్వుతూ) నేను నిన్ను వెర్రివాడిని చేయాలనుకోలేదు, అదలా జరిగిపోయింది. నేను చేయగలిగింది ఏమీ లేదు" అని వివరిస్తాడు. దాసగణుమహరాజ్ –



కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్ల పెట్టెలోని చీర గురించిన కథలోనూ, ఈశావాస్యోపనిషత్తులో చెప్పిన విషయంలోనూ ఉన్న అసలు ఉద్దేశ్యం ఇదే. పెట్టెలో ఉన్న చీరలాంటిదే, ఈ కథలో సాక్షాత్కారానికి సంబంధించిన హామీ. దీనిని రెండు రకాలుగా తీసుకోవచ్చు. సాధారణంగా అందరూ, "ఓరి భగవంతుడా, నాకు విష్ణుమూర్తి అనుగ్రహం అసలు లేనే లేదు. వెయ్యి జన్మలు ఎత్తాలా? అదేమి ప్రేమ? అన్ని జన్మలు ఎత్తాలా? ఆ కర్మనంతా ఆయనే భస్మం చేయలేరా? ఆయనకు ఆ శక్తి లేదా?" అనుకుంటారు (గురువుగారు నవ్వుతూ) కానీ దీనికి బదులు ఆ సాధువు ఎంతో సానుకూల వైఖరితో ప్రతిస్పందించి, "ఆయన నాకు సాక్షాత్కారమిస్తాడు. ఆహా! నాకు ఎంతో సంతోషంగా ఉంది" అని ఆనందాతిశయంతో కేకలు వేసాడు.

**ఆ ఆనంద పారవశ్యం, సానుకూల దృక్పథం అనేవి సాక్షాత్కారానికి కీలకం.** అందుకనే ఎవరైనా "అన్ని జన్మలు ఎందుకు పడుతుంది? ఈ ప్రక్రియ అంత సుదీర్ఘంగా ఎందుకు సాగుతుంది?" అని అడిగితే – దానికి సమాధానం ఉండదు. అది ఈ క్షణంలో జరగవచ్చు లేదా ఎప్పటికీ జరగకపోవచ్చు. "ఎంత కాలం?" అనేది అర్థంలేని ప్రశ్న. **నీకెంత తపన ఉందో అంతకాలం. కాబట్టి ఎంతకాలం అనేదానికి 'నీకెంత ఎక్కువ తపన ఉందో అంత త్వరగా' అనేదే సమాధానం. అదెంత కాలం అంటే నీ తపన ఎంత గాఢమైనదైతే అంత తక్కువ కాలం.** ఇది చాలా మంచి కథ. ఇది కొన్ని వందల, వేల విషయాలను తెలియచేస్తుంది. ఈ ఒక్క కథ నాకు ఎన్నో శాస్త్రాలతో సరిసమానం. అది కేవలం కల్పితమే కావచ్చు. కథే కావచ్చు కానీ అదేం పట్టించుకోనక్కరలేదు. నాకు ఎన్నో శాస్త్రాల సారాన్ని ఈ కథ తెలియచేస్తుంది.

**భక్తుడు :** గురువుగారూ! మేము బాబా సన్నిధిని అనుభవంలోనికి తెచ్చుకోవాలని తపిస్తుంటాము. బాబా సన్నిధిని ఇంకా ఇంకా అనుభవంలోనికి తెచ్చుకోవడం ఎలా?

**గురువుగారు :** బాబా సాన్నిధ్యం మీకు నిజంగా అవసరమైతే ఆయనే ఇస్తారు. ఆయన తమ సాన్నిధ్యాన్ని ఇస్తూనే ఉన్నారు కూడా! ఒక్కసారి మీరు కాస్త గతంలోకి చూస్తే ఆయన సాన్నిధ్యాన్ని మనకు ప్రసాదించినప్పటికీ మనం ఎలా నిరాకరిస్తామో తెలుస్తుంది. మనం ఒకదాని గురించి అడుగుతాం, తీరా అది ఇచ్చినపుడు మనం దానిని గుర్తించం. అందువలన మనం దానిని కోల్పోతాం. కానీ బాబా సన్నిధి ఎప్పుడూ ఉంది.

**నరుడు సంపదలను ఆశ్రయించిన దరిద్రుడు.**



మీరు నిజంగా నిజాయితీగా, హృదయపూర్వకంగా, చిత్తశుద్ధితో బాబా సన్నిధిని కోరుకుంటే, ఆయనను పిలవండి. దానికి అదొక్కటే మార్గం. పిలవండి, పిలవండి, పిలవండి! అప్పుడు ఆ సన్నిధి మీకు లభిస్తుంది. క్రిందటిసారి నేను దీనిని మీకు చెప్పినప్పటి నుండి మీరు ఎన్ని గంటలపాటు అలా కూర్చుని బాబాను పిలిచారు? మీ స్థానంలో నేను గనుక ఉంటే కనీసం 8 నుండి 10 గంటల పాటు కూర్చుని అలా పిలుస్తూ, పిలుస్తూ, పిలుస్తూ ఉండేవాడిని. **"బాబాను పిలవమని, పిలిస్తే బాబా ఇస్తారని గురువుగారు చెప్పారు, ఆయన ఆ హామీ ఇచ్చారు, కానివ్వండి చేసి చూద్దాం"...** ఇలా ఆ తపనను పెరగనివ్వండి, కోరికను పెరగనివ్వండి, మన తపనకు, ఆనందానికి మధ్యలో వచ్చే అడ్డంకులను తొలగిపోనివ్వండి. అప్పుడు మీరు దానిని పొందుతారు. నేను చెబుతున్నాను కదా, **బాబా ఎవ్వరినీ వదిలిపెట్టరు, "ఎవ్వరూ వట్టి చేతులతో తిరిగి వెళ్ళరు".**

– *శరశ్చంద్రికలు రెండవభాగం*

# గురుకృపాలహరి

**అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం**

**తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవేనమః**

అఖండమై, వర్తులాకారమై, ఆది అంత్యము లేక వ్యాపించి, కదలునట్టియు, కదలనట్టియునగు సర్వవిశ్వమునావరించుకొని యున్నట్టి పరమపదమును దర్శించి, దర్శింపచేయునట్టి జ్ఞానస్వరూపునకు నమస్కారము. గురు స్వరూపమంటే జగద్రక్షకుని మానవరూపం – సంచరించే దైవత్వం. కంటికి కనిపించేది, కన్పించనిది, చరము, అచరము అయిన ప్రతీ జీవిలోనూ తానే నిలచి, తానే నడిపి, కడకు తనలోనే కలుపుకునే పరబ్రహ్మ స్వరూపం గురువు. నరజన్మ దుర్లభమనీ, మనకు మాత్రమే 'బుద్ధి' కలిగిందని విజ్ఞులు చెపుతూంటే మనకు సందిగ్ధంగా ఉండవచ్చునేమో గానీ శ్రీసాయి వంటి సద్గురుసామ్రాట్టు, పరమాచార్యుల వంటి కరుణాపూర్ణులు, శరశ్చంద్రుల వంటి పరిపూర్ణానుగ్రహ స్వరూపుల ఊసు తలపోసిన మనసుకు మానవజన్మ సార్థకత తప్పక అవగతమవుతుంది. పరమాచార్యుల జీవితాన్ని ఆస్వాదించిన కొద్దీ అవగతమయ్యే ఒక్కటే విషయం – 'ప్రేమ'. అది

**తెలిసిన అర్థమును మనస్సు నిర్లక్ష్యము చేయును. తెలియని అర్థమునకు వైముఖ్యము వహించును.**



ఎంతటి ప్రేమంటే జీవులన్నిటికీ 'ఆనందాన్ని' ప్రసాదించాలనేంత ప్రేమ. నిజానికి ఈ ప్రేమే లక్ష్యము, మార్గము, గమ్యము అంటారు శ్రీబాబూజీ. ప్రేమ గురించి మా పూజ్యగురుదేవులు ఇలా అన్నారు "ప్రేమ ద్వారా సంపూర్ణానందాన్ని పొందడం నీ లక్ష్యం. ఈ (లక్ష్య) సాధన యొక్క మొట్టమొదలే చిట్టచివర కూడాను. నువ్వు దీనిని (ఆ ప్రేమను) ఆరంభం నుండే అనుభవిస్తావు. ఈ మార్గమే గమ్యం. వాస్తవానికి వేరే గమ్యమంటూ ఏమీ లేదు. ప్రతిక్షణం నువ్వు దానిని ఎంతగా అనుభవించగలుగుతున్నావు అనేదే ముఖ్యం. అది పూర్ణంగానా, పరిపూర్ణంగానా, పూర్ణాతిపూర్ణంగానా! ఈ వాక్యం వ్యాకరణబద్ధంగా తప్పుకావచ్చు. కానీ మనం అలానే అనుభూతి చెందుతాం. ప్రతిక్షణం పూర్ణంగా, ప్రతి అడుగూ పూర్ణంగా! కానీ ఎప్పుడూ ఇంకా పరిపూర్ణంగా ఉండాలనిపిస్తుంది. అంతేకాదు, నీవు ఆ అనుభవాన్ని ఇంకా ఇంకా కావాలనుకుంటావు. కాబట్టి అక్కడ దుఃఖం లేదు, మార్గాలు లేవు, గమ్యం లేదు. **కేవలం తనకు తానే ఆజ్యమై రగిలే ప్రేమ, పూర్ణత్వాన్ని చేకూర్చే ప్రేమ! మనల్ని పరమానందభరితుల్ని చేసే ఆ ప్రేమానుభవం – అదే ఆరంభం. అదే సాధన, అదే గమ్యం. అది లక్ష్యాన్ని చేరే మార్గం కాదు. అదే గమ్యం – దాని గురించే నేను చెబుతున్నది"**. పరమాచార్యుల జీవిత సందర్శనం బాబూజీ 'ప్రేమ' మాటల్లో అనవచ్చు. వారి కరుణ ఎంతటిదంటే జగత్తులోని ఏ జీవికి కష్టం కలిగినా తనకు ఆ కష్టాన్ని ఆపాదించుకునేంత 'కరుణ'. రాశీభూతమయిన ఆ మాతృత్వం ఎంతటిదంటే సప్త సముద్రాల ఆవలనున్నా తన తలపుతోనే తమ బిడ్డలను తమ రెక్కల చాటున పొదుముకునేంత మాతృత్వం. వారి అనుగ్రహ విశేషం ఎంతటిదంటే 'శేష'మే లేక విశేషమైన సద్గురుచరణం ప్రసాదించేంత! జ్ఞానభాస్కరుని (సూర్యుడు), అనుగ్రహ 'చంద్రుని' ఏనాడైనా మనిషి చేతులతో పట్టుకోగలుగుతాడా? స్వామి వారి గూర్చి తలపోయడం, అక్షరంగా వ్రాయటం కూడా అలాంటిదే! తత్త్వవేత్తల నుండి నవ వైతాళికుల వరకు ఎందరో పరమాచార్య స్వామి వారి గురించి వచించి, రచించి చివరకు మాటలకందని మహోన్నత వ్యక్తిత్వమని మూగపోయారు – ఈ శీర్షికలు కేవలం చంద్రునికో నూలుపోగు వంటివి మాత్రమే. సద్గురు అనుగ్రహంతో కుంటివాడు కొండలనెక్కుతాడు, మూగవాడు మాట్లాడతాడు అన్నారు కదా పెద్దలు – కేవలం ఆ అనుగ్రహ ఆస్వాదనాసక్తితో జరిగేదే ఈ ప్రయత్నం.

మహాత్ముడు దర్శనమివ్వగానే భరతజాతి ఎందుకు మోకరిల్లిందంటే – తల్లిదండ్రుల సంరక్షణలో

పెరిగే బిడ్డకు తమకు తెలిసిన, తోచిన పరిధిలో వారి ద్వారా మార్గనిర్దేశనం లభిస్తే, అవ్యాజమైన ప్రేమస్వరూపులై ఆశ్రిత జనులను ఆదుకుంటూ, ఎదురయ్యే ప్రతీ అడ్డంకిలోనూ ఆదరువుగా నిలిచి అడుగు తడబడకుండా కాపాడేవారు మహాత్ములు. ఐహికమైన కోర్కెలతో, కష్టాలతో ఒడిచేరే బిడ్డలను– చెంతన చేర్చుకుని ఆనందపథంలో నిలిపిన శ్రీసాయి వంటి ఎందరో మహాత్ములు పాదస్పర్శతో పావనమయ్యింది ఈ తపోభూమి. **"మానవజాతి పతనం ఎంత బలంగా ఉంటుందో మహాత్ముల ఆగమనం కూడా అంతే బలంగా ఉంటుంది" అంటారు పరమాచార్యులు. బహుభాషా కోవిదులై, జ్ఞానగిరులై, సకల విద్యాపారంగతులై దేహమును ధరించిన వారికి లభించని, పొందలేని ఐహిక సుఖమేముంటుంది? అన్నీ త్యజించి, జాతిహితానికై పరివ్రజించి (దేశమంతా సంచరించి) మనిషిని దైవంగా మలిచే క్రమంలోని కేవల నేపథ్యం అవ్యాజమైన వారి 'ప్రేమ' మాత్రమే.**



శ్రీచరణుల కరుణ ఎంత ఉత్కృష్టమో, మహోన్నతమో తెలిపే సంఘటన ఇది. జీవులకు హాని జరుగుతుందని పాదచారిగానే యావత్ భారతాన్ని తమ పదస్పర్శతో పావనం చేసిన వారని చెప్పుకున్నాం కదా! స్వామి వారు ఒకసారి మఠంలో గోడనానుకుని కూర్చున్నారు. కూర్చొని ఉండగా తెలివివచ్చే సమయానికి తమ వీపు మీద ఏవో పాకుతున్నట్లు తోచింది. అప్పటికే స్వామి వారి శరీరానికి చెదపురుగుల వల్ల కొంత హాని జరిగి పోయింది. అక్కడే ఉన్న శిష్యుని పిలిచారు స్వామి. ఎవరైనా వెంటనే వాటిని గుడ్డతోనో, చేత్తోనో విదిలించి వేస్తారు. కానీ స్వామి మాత్రం ఆ చెదపురుగులలో ఒక్క దానికైనా హాని కలుగకుండా శ్రావణంతో నెమ్మదిగా తీసివేయమని ఆజ్ఞాపించారు. చెద పురుగులకెక్కడా అపాయం కలుగకుండా వాటినన్నింటిని జాగ్రత్తగా తొలగించడం శిష్యకోటికి భారమనిపించింది – అయినా స్వామి సంకల్పం నెరవేరింది. **విరాట్ స్వరూపుడు వివిధ రూపాలుగా విలసిల్లుతుంటే ఏ రూపమైనా తన రూపమే! ఏ కష్టమైనా తనకు విదితమే!**

1927వ సం॥లో పరమాచార్యులు కేరళకు వేంచేశారు. కేరళలోని పాలక్కాడ్‌లో వారు సుమారు మాసం పాటు బుధజనులకు ఆశీస్సులను అందచేసి ఆ తర్వాత కొల్లన్‌గోడ్ సంస్థానం వారి మర్యాదలు స్వీకరించి ముందుకు సాగారు. అక్టోబర్ 15, 1927వ సం॥ పాలక్కాడ్‌లోని నలిచేరి గ్రామంలో ఒక గోశాలలో స్వామివారు మహాత్మాగాంధీకి దర్శనమిచ్చారు. కేవలం ఒకరిద్దరు అంతరంగికులు మాత్రమే లోనికి అనుమతించబడ్డారు. పత్రికా విలేఖరులు మరియు ఇతర నాయకులెవ్వరికీ ప్రవేశం



కల్పించబడలేదు. హిందూ సాంప్రదాయంలో మహాత్మాగాంధీ – ఆ మహితాత్మునికి నమస్కరించి ఆశీస్సులు పొందారు. ఒక సుదీర్ఘమైన మౌనం ఆ ప్రాంగణాన్ని ఆవరించింది. ఆ మౌనంలోనే 'మహాత్మా'–ఆ మహితాత్మునికి మనోకుసుమాలతో అర్చన చేసుకున్నారు. సంస్కృతంలో కుశలు ప్రశ్నలు అడిగి గాంధీగారిని కూర్చోమని చెప్పారు స్వామి. సంస్కృతం తనకు అర్థమయినా మాట్లాడటం కష్టమని, గాంధీగారు హిందీభాషలోనే మాట్లాడారు. జాతికి గాంధీగారు చేస్తున్న సేవలను హర్షిస్తూనే – ఆధ్యాత్మిక మూలాలపై నిర్మింపబడితే జాతి వైభవం సమున్నతంగా నిలుస్తుందని స్వామి–'బాపూ'కు సూచించినట్లు భక్తులకు తెలిసిన విషయం. మహాత్మాగాంధీ కూడా తమ భావాలను పారదర్శకంగా వ్యక్తం చేసినట్లు – ఆ సంభాషణ ఒకరిపట్ల ఒకరికి ఉన్న గౌరవభావాన్ని పంచుకున్నట్లు, బేధాభిప్రాయాలు తలెత్తనట్లు చారిత్రకుల అభిప్రాయం. సుమారు 5:30 గం॥ల సాయం సమయం కావడంతో గోశాల బయట వేచిచూస్తున్న చక్రవర్తుల రాజగోపాలాచారి (రాజాజీ)గారు లోనికి వెళ్ళి గాంధీగారికి తమ సాయంత్ర ఆహారం గురించి గుర్తు చేసారట. గాంధీగారు సాయంత్రం ఆరు గంటల తర్వాత ఆహార సేవనం చేసే వారు కాదు. అయితే గాంధీగారు ఎంతో సౌమ్యంగా "శ్రీచరణులతో జరుగుతున్న ఈ సంభాషణే నాకు ఈనాటి సాయం భోజనం" అని సెలవిచ్చారు. పరమాచార్యులు గాంధీగారికి ద్రాక్షపండ్లను ఇవ్వడం – వారెంతో భక్తితో వాటిని తీసుకుని ద్రాక్ష తనకు ప్రియమైనదని తెలియచేయడం జరిగింది. చివరకు స్వామి వారి వద్ద సెలవు తీసుకుంటూ వారు చేసిన సూచనలను సాధ్యమైనంత వరకు పాటిస్తానని విన్నవించి సెలవు తీసుకున్నారు బాపు. అంతరంగిక భక్తులు గాంధీగారితో జరిగిన సంభాషణ గురించి స్వామివారితో ప్రస్తావించినా, ఇద్దరు తమ హృదయగత భావాలను పంచుకోవటం జరిగింది కనుక ఆ విషయాలను చెప్పడాన్ని సున్నితంగా తిరస్కరించేవారు స్వామి. **జాతిని పరతంత్ర శృంఖలాల నుండి స్వాతంత్ర్యం వైపు నడిపిన సత్యమూర్తి 'మహాత్ము'డిగా కొలవబడితే – పతనమైపోతున్న మనిషి 'అహం' శృంఖలాలను ఛేదించి – సర్వతంత్ర స్వతంత్రునిగా (దైవంగా) ఎదిగేందుకు అహరహం శ్రమించిన కారుణ్యమూర్తిగా, మహా 'మహితాత్ముని'గా పరమాచార్యులకు ఈ జాతి మోకరిల్లింది.**

1927వ సం॥ కంజికోడ్‌లో చాతుర్మాస్యం అయ్యాక పరమాచార్యులు దక్షిణ కేరళవైపు తమ పాదయాత్ర సాగించారు. ఫిబ్రవరి మాసం 1928వ సం॥ గురువాయూర్ శ్రీకృష్ణుని దర్శించాక



వేచి చూస్తున్న వేలాది మంది భక్తులకు దర్శనాశీస్సులు అందచేసారు. కొచ్చిన్, తిరువనంతపురం, కొల్లం చుట్టుప్రక్కల ఉన్న దేవాలయాలను తాము దర్శించడము, తమ పవిత్ర సన్నిధిని కేరళీయులకు ప్రసాదించడము జరిగింది. స్వామి వారు మలయాళంలో మాట్లాడిన తీరు స్వామి వారి మాతృభాష మలయాళమా అన్నట్లు తోచింది స్థానికులకు.

1929వ సం॥ తమిళనాడులోని తిరుచ్చి, దక్షిణ, ఉత్తర ఆర్కాట్ జిల్లాలను పావనం చేసారు. తమ పాదస్పర్శతో. తాండలంలోని ఒక గ్రామంలో ఒక గొర్రెల కాపరి తన యావదాస్థిని అమ్మి వచ్చిన ధనాన్ని దక్షిణగా స్వామిపాదాలకు సమర్పించాడు. దయాళువైన స్వామి ఆ గ్రామ తహసీల్దారుతో మాట్లాడి నాలుగు 'కానీ'ల (కానీ = 1.3 ఎకరాలు) స్థలాన్ని ఆ భక్తునికిప్పించారు. జూలై 24, 1929వ సం॥ పూర్వాశ్రమంలో తండ్రి గారైన సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కుంభకోణంలో పరమపదించారు. మఠ అంతే వాసులు స్వామివారికి ఈ విషయం తెలియచేసినప్పుడు మౌనవే వారి సమాధానమయ్యింది.

1929వ సం॥ డిసెంబరు నెలలో పరమాచార్యస్వామి వారు–పరమపావనమై, యోగిపుంగవులెందరో విలసిల్లిన పుణ్యతీర్థమై, ఎందరో సాధకులకు తపోక్షేత్రమై, అణువుణువూ శక్తితో అలరారే శక్తిక్షేత్రమై, ఎందరో 'మహర్షుల' అనుగ్రహ కిరణాలతో తేజోమయమై, ఆర్తత్రాణపారాయణులకు కొంగు బంగారమై, సద్గురు 'చంద్రుల' నెందరినో భరతజాతికి ప్రసాదించిన పర్ణశాలయై, దివ్యమై, దేదీప్యమై విలసిల్లిన, విలసిల్లుతున్న 'అరుణాచలాని'కి వేంచేశారు. పంచభూత లింగస్వరూపాలలో అగ్నిలింగమని, తేజోలింగమని కొలవబడుతున్న పురాతన ఈశ్వర సాన్నిధ్యం అరుణాచలము. ఎన్నో స్థల పురాణాలు ప్రాచుర్యంలో ఉన్నా, భృంగి అనే మహర్షికి ఈశ్వరుని పట్ల అనన్యభక్తి ఉండటం – ఆ మహర్షి ఈశ్వర పత్నియైన అంబికను పూజించటానికి కూడా నిరాసక్తుడై ఉండటం చివరకు అంబిక ఈశ్వరుని ఎడమ భాగాన సగమై అర్ధనారీశ్వరునిగా రూపుదాల్చినట్లుగా చారిత్రకులు చెపుతారు.

అలా అర్ధనారీశ్వరుడుగా, అరుణాచలేశ్వరుడుగా, అమ్మను ఆపీతకుచాంబగా ఆరాధిస్తారు. అరుణాచలంలో జరిగే పర్వదినాలలో కార్తీకదీపం ఎంతో విశేషంగా జరుగుతుంది. ఆనాడు హిందూ దేవాలయాలలో, ఇళ్ళలో దీపకాంతుల ఉత్సవంగా జరుపుకుంటారు. తమిళుల పంచాంగాన్ని అనుసరించి కార్తీకమాసం పూర్ణిమరోజున (కృత్తికా నక్షత్రం) ఇది జరుగుతుంది. ఈశ్వరుడిని గొప్ప



తేజోస్వరూపంగా దర్శించే క్రమంలో ఒక పెద్ద జ్యోతిని అరుణగిరిపై వెలిగిస్తారు. ఈ దీపం కొన్ని మైళ్ళ దూరం దర్శనమిస్తుంది. లక్షలాదిగా తరలివచ్చే దేశవిదేశీయులు తామున్న స్థలం నుండే అరుణగిరితోపాటు ఈ దీపాన్ని కూడా సాక్షాత్ పరమేశ్వరునిగా భావించి, దర్శించి తరిస్తారు. కార్తీకదీపాన్ని దర్శించవచ్చిన పరమాచార్యులకు వేలాదిగా తరలివచ్చిన తిరువణ్ణామలైవాసులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజ్య ఆచార్యులు సుమారు మాసంపాటు అరుణాచలంలో విడిది చేసారు. గిరిప్రదక్షిణతోపాటు ఎన్నోసార్లు అరుణాచలేశ్వరుని దర్శనం కూడా చేసుకున్నారు స్వామి. ఇది స్వామివారి మొదటి అరుణాచలయాత్ర. మత సాంప్రదాయాన్ని అనుసరించి రమణాశ్రమునకు పరమాచార్యులు వెళ్ళనట్లు అవగతమవుతోంది. కానీ భగవాన్ రమణుల పట్ల, శేషాద్రిస్వామి వారి పట్ల వారికున్న గౌరవభావం పూజ్య శ్రీబాబూజీ వ్యాసాలలోనూ, ఈ క్రింది సంఘటనలోనూ వ్యక్తమవుతోంది. మొదలు పరమ నాస్తికునిగా, గొప్ప కవిగా అందరికీ తెలిసిన తమిళకవి కన్నదాసన్ పరమాచార్యుల అనుగ్రహంతో ఆస్తికునిగా మారి వారిపై ఒక ఆశువును రచించి సమర్పిస్తాడు. "ఎవరి కనుచూపుతోనే అన్ని పాపాలు నశించిపోతాయో, ఎవరు తిరువాచకానికి సాకార స్వరూపమై నిలచినారో, ఎవరు తన మేధస్సు చేత సత్యజ్ఞానానికి అర్థం చెప్పగలరో, ఎవరు ఈ విశ్వాన్ని రక్షించడానికి వచ్చిన విశ్వనాథుడో, ఎవరు అన్ని మతాల చేత తమ దేవుడని ఒప్పబడినారో, అటువంటి వారి చరణారవిందములకు మనల్ని సమర్పించుకుందాము రండి! అందరూ తరలిరండి!!" ఈ ఆశువును విని స్వామి కన్నదాసన్‌తో అంటారు "నువ్వు చెప్పినది కేవలం శేషాద్రిస్వామి వారికి మాత్రమే సరిపోతుంది. ఆయనే తిరువణ్ణామలైలోని అర్ధనారీశ్వరుడు. ఆయనే సత్పురుషుడు – మహా మనీషి" అని. **సద్గురు అనుగ్రహం కొంత చవిచూడగానే ప్రతీ వ్యక్తి 'తీర్పు' ఇవ్వడం ప్రారంభిస్తాడు. మహాత్ముని మానసం మనిషికి అవగతమవ్వడం సాధ్యమేనా? మౌన సంభాషణలు, మహోన్నత ఆదర్శాలు, ప్రతీ జీవిలోనూ మాధవుని దర్శించే వ్యక్తిత్వాలు – ఇవి వారి జీవితాలు. పీఠ'ధర్మం' ఒక వైపు – తానెరిగిన 'మహర్షు'ల అవతార 'మర్మం' ఒకవైపు!**

స్వామి పూసమలైలో విడిది చేసి ఉండగా వెల్లూరు నుండి ఒక భక్త బృందం స్వామివారి దర్శనం చేసుకున్నారు. వైద్యులు, లాయర్లు, గవర్నమెంటు ఉద్యోగులు, వ్యాపారులు ఇలా అందరూ ఉన్నారు ఆ బృందంలో. వారిలో కొందరు సంగీతము, గానము తెలిసి–శ్రావ్యంగా కీర్తన చేయగలరు. అంతేగాక



వారితో తంబురా, మృదంగం వంటి వాయిద్యాలను కూడా వెంట తెచ్చుకున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో పర్వతపాదంలో స్వామి విడిది చేసిన చోటుకు రమ్మని చెప్పారు స్వామి. సాయం సంధ్యలో అందరూ స్వామి చెంత పరివేష్ఠితులై మెల్లగా, బృందగానంగా కీర్తనలు సాగాయి. వారిలో ఒక వైష్ణవ భక్తుడు ఎంతో సమ్మోహన గాత్రంలో ఆలపిస్తున్నాడు. "శివదీక్షాపరుల..." అంటూ సాగుతున్న కీర్తనను ఆపి స్వామి అతనిని ఆ చరణం అర్థమేమిటని అడిగారు. తడబడుతూ "శైవులతో చేరవద్దన్న" అర్థం వస్తుందని ఇబ్బందిగా చెప్పాడు అతను. అక్కడి భక్తులు ఘొల్లున నవ్వారు అది విని. కానీ స్వామి వారినందరిని వారించి ఆ కీర్తన నిజతత్త్వాన్ని తెలియచెప్పారు. హాస్యానికి, ద్వేషానికి ఆ కీర్తనలో చోటులేదని. పద, అర్థగాంభీర్యం కంటే భక్తిగాంభీర్యాన్ని మనందరం దర్శించాలని చెప్పారు. అంతేకాదు ప్రతీ మనిషి ఆ కీర్తనాచార్యునికి కల్గిన అనన్య భక్తిని ఆదర్శపథంగా తీసుకుని ఆచరించాలని తెలియచేసారు. నిష్కర్షగా, పారదర్శకంగా స్వామి చేసిన ఈ ఊహించని బోధను ఎంతో గొప్పగా అర్థం చేసుకున్నారు – స్వామి చరణాలకు సవినయంగా సాగిలపడి అట్టి భక్తిని అనుగ్రహించమని – తాము స్వామి చెప్పినట్లు నడుచుకుంటామని విన్నవించుకున్నారు వెల్లూరు నుండి వచ్చిన భక్తబృందం.

**అనన్య భక్తియే ప్రేమ అని నారదమహర్షి భక్తిని సూత్రీకరిస్తే పరమాచార్యులు – చిత్రపటాల కొలువుగా మారిపోతున్న పూజ మందిరాలను కాదు నిర్మించవలసింది – అనన్యంగా ఆరాధించిన రూపాన్ని మనో మందిరంలో సుప్రతిష్టం చేసుకోవాల్సింది అని మార్గం చూపారు. భక్తిని అభ్యాసం చేసిన మనిషి మహాత్ముడు అవుతున్నాడు – 'యుక్తి'ని అభ్యాసం చేసిన మనిషి గమ్యం చేరలేకపోతున్నాడు. సద్గురు అనుగ్రహ 'శక్తి' నెరిగి – 'యుక్తి' తొలగి – 'భక్తి' కలిగి 'ఆద్యంతా'లు లేని ఆ సద్గురు చరణాలను చేరదాం... సద్గురు చరణం... శరణం...** **–గురుకృప**

**"ధ్యేయ" దీప కాంతిలో "శ్రద్ధ-సబూరీ"లతో ప్రయత్నమే స్వయత్నమై**
**నూతన సంవత్సరంలో ముందుకు సాగాలని శుభాకాంక్షలు**

సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com** సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**
గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**



***(14వ పేజీ తరువాయి)*** ఆమె బంధువులు ఆమెను నా దగ్గరకు తీసికొనివచ్చారు. పరిస్థితి చెప్పారు. దిగులుగా ముఖంపెట్టారు. నేను భాగవతం ప్రథమస్కంధంలోని ఒక సూక్ష్మాంశాన్ని గూర్చి వారికి వివరించాను. భక్తిభావనలోపడి తాత్కాలికంగా కర్తవ్యాన్ని నిర్వహించలేని వారుంటారు. వారిని గూర్చి కంగారుపడవలసిన పనిలేదు. భగవంతుని అభయహస్తం వారిని వెన్నంటి ఉంటుంది. తగిన సమయంలో వారికి కావలసిన ప్రచోదనం అందుతుంది. దానితో వారు అనన్యచింతన యొక్క నిజస్వరూపాన్ని గ్రహిస్తారు. కర్తవ్య నిర్వహణను నిండుగా కొనసాగిస్తారు – అని వారికి వివరించాను. ఆ అభయవచనం వారిని సేదతీర్చింది. వాళ్ళముఖాలలో వెలుగు రేఖలు గోచరించాయి.

కొంతసేపటి తరువాత ఆమెను పిలిచి కూర్చోపెట్టి అడిగితే జరుగుతున్నది అమె చెప్పింది. జరుగవలసినది నేను చెప్పాను. అనన్యచింతన అన్నది ఎలాగ సాగాలి అన్నది ఆమెకు వివరించాను. నా వివరణ ఆమెకు నచ్చింది. ఆమెకు కావలసిన ప్రచోదనం అందింది. ఆమె ముఖంలో ఎనలేని తృప్తి తొణికిసలాడింది. తాను నమ్మిన దైవమే ఇలా కలుగజేసికొని నడిపిస్తున్నాడు అన్న దర్శనాన్ని పొంది ఆమె పరవశించింది. దానితో కథ దారికి వచ్చింది. అప్పటి నుండి ఆమె నుండి జరిగినది పర్యుపాసన. అప్పటి నుండి ఆమెకు అనుభవానికి వచ్చినది, నిత్యాభియుక్తస్థితి, దేవదేవునితో నిత్యానుసంధానస్థితి, నిత్యానుసంధానము అంటే ఎడతెగని అనుసంధానము. ఆ అనుసంధానము అలా సాగుతూనే ఉంటుంది. అనన్యస్థితి అంటే ఇది అని అప్పటికి అనుభవమవుతుంది.

ఈ అభయవచనాలలో రెండు భాగాలున్నాయి. మొదటిభాగం మనం ఆచరించవలసినది. రెండవభాగం దైవం మనకు అనుగ్రహించవలసినది. అనన్యచింతన మనం చేయవలసినది. మన యొక్క యోగక్షేమములు అతడనుగ్రహించవలసినవి. మనం చేయవలసినవి మనం చేస్తూ ఉంటే, అతడు చూడవలసింది అతడు చూస్తూ ఉంటాడు. మనం అనన్యచింతనలో ఉండగా, మన యొక్క యోగక్షేమాల బాధ్యతను అతడు వహిస్తాడు. మన పని, సాధనను కొనసాగించడమే! యోగక్షేమాల విషయమై మనం కంగారుపడవలసిన పనిలేదు. వాటి విషయం తనకు వదిలేయమంటున్నాడాయన. అది తన బాధ్యత అంటున్నాడు. నీవు చేయవలసింది నీవు చేయి. నేను చూడవలసింది నేను చూస్తాను. నేను చూడవలసిన దానిని గూర్చి నీవాలోచించకు. అసలు అలా ఆలోచించవలసిన

అవసరం నీకులేదు. ఆ అవసరం నీకు రాదు, రానీయను.



ఈ సూక్ష్మం తెలియక కొందరు 'ఇంతకూ మన సాధన ఎంతవరకూ వచ్చింది? కుండలిని ఎంతవరకు ఎగ(బ్రాకింది. యోగస్థితి ఎంతవరకు కుదురుతోంది. యోగస్థితిలో మనం ఎంతవరకు నిలబడగులుగుతున్నాం? మొదలయిన అంశాలను ఎవరయినా మహనీయులు కనబడినప్పుడు విచికిత్స చూస్తూ, ఇంతకూ నా స్థాయి ఏమిటి? నేనెక్కడున్నాను? సాధన బాగా జరుగుతున్నట్లేనా? అని అడుగుతూ ఉంటారు. ఇదంతా ఉండపట్టలేని ప్రవర్తన, అవసరంలేని ఆలోచన, పడనక్కరలేని తాపత్రయం, కూడని చర్చావిధానం. సాధనచేయి, యోగస్థితి లభించడమన్నది అది నాకు వదలిపెట్టు. అది నా బాధ్యత అని దైవం అంటూ ఉండగా ఆ దేవదేవుని బాధ్యతలో మనం వేలుపెట్టాలని చూడటం కుత్రతనమవుతుంది. ఇంకా చెప్పాలంటే అతడిని శంకించడమవుతుంది. ఈ లోపున మనం చేయవలసిన సాధనకు గండిపడుతుంది. అనగా అనన్య చింతనకు అంతరాయమేర్పడుతుంది. కనుక సాధనలో ఎంతవరకు వచ్చామన్న విచికిత్స ఎన్నడూ కూడదు. అనన్యచింతనలో వర్తిస్తూ ఉండటమే మనం చేయవలసినది. ఇక యోగస్థితి అన్నది ఎప్పటికి ఎలా లభించాలన్నది దైవానికి సంబంధించిన అంశం. అది మనం తాపత్రయపడితే అందేదికాదు. దైవం మన సాధనకు ముచ్చటపడి అనుగ్రహించేది. అనుగ్రహించవలసినది ఆయన, అనుగ్రహంపైన మన అజమాయిషీ కూడనిపని, అక్కడ లెక్కలు లెక్కచేయబడవు. **అనుగ్రహమంటేనే మానవీయమయిన లెక్కలకు, కొలతలకు, విచికిత్సలకు అతీతమైనది అని అర్థం.**

ఇలా అనన్యచింతనలో ఉండటం మన బాధ్యత. యోగస్థితి ఒనగూడేట్లు చూడటం అతని బాధ్యత. కనుక మన పని మన బాధ్యతను మనం నిండుగా నిర్వర్తించడమే! యోగస్థితితోపాటు క్షేమస్థితిని కూడా నేనే చూసుకొంటాను. అంటున్నాడాయన... నీవుమాత్రం ఏ మాత్రం ఏమరుపాటు చెందకుండా అనన్యచింతనలో ముందుకుసాగు. ఇది నా నిర్దేశం! అన్నది ఆయన అభయవచనం.

యోగాన్ని గూర్చి విచికిత్స చేసినట్లుగానే తెలిసీతెలియని మానవుడు క్షేమాన్ని గూర్చి కూడా విచికిత్సకు లోనవుతూ ఉంటాడు. రోజులు ఎప్పటిలా లేవుకదా! ఇప్పటి ఈ కాలంలో ఇది సాధ్యమా? ఇలాంటి సాధనలో ఉండి మనం బ్రతికి బట్టకట్టగలమా? రాజీపడక తప్పదేమో? నలుగురితో నారాయణ అనక కుదరదేమో అనిపించవచ్చు. అటు దేశ పరిస్థితులూ, ఇటు కుటుంబపరిస్థితులూ



త్వరత్వరగా మారిపోతున్నాయి. భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న ఆలోచన కలుగవచ్చు. ఆ ఆలోచన ఒక బెంగగా మారవచ్చు. చుట్టూ ఉన్న వారందరూ ఎవరి జాగ్రత్త వారు పడుతూ ఉండగా, మనమొక్కరమే సాధన అంటే సరిపోతుందా? చివరకు ఈ సాధనలో మనం ఒంటరివారుగా మిగిలి పోతామేమో? మిగిలినవారి కన్నా అన్ని విధాల వెనుకబడిపోతామేమో? వారు పడిన జాగ్రత్త మనం పడటంలేదుకదా! వారు త్రొక్కినదారులన్నీ మనం త్రొక్కడం లేదుకదా? మనం సూటిగా పోతున్నాము కదా! దీని ఫలితమెలా ఉంటుందో అనిపించవచ్చు. మనం ఎక్కడ మునిగి ఎక్కడ తేలుతామో అనిపించవచ్చు. మన జీవితానికి ఒక రక్షణ కావాలికదా! మన భవిష్యత్తుకూ ఒక రూపం కావాలి. తన్నుమాలినధర్మం మొదలు చెడ్డబేరం అవుతుందికదా? కనుక మనం మొత్తం దైవానికి వదిలి-కూడని సాహసం చేస్తున్నామేమో! అన్న భావన కలుగవచ్చు. ఇలా మనస్సు పరిపరివిధాలుగా ఆలోచించవచ్చు. అనన్యస్థితిలో కుదురుకొనేలోపున దానికి ఇన్ని విధాల ఆలోచనలు కలుగవచ్చు. ఒకొక్కప్పుడు అందివచ్చిన అనన్యస్థితి నుండి కూడా జారిపోవటం వల్ల ఇలాంటి ఆలోచనలు కలుగవచ్చు. జరుగవచ్చు.

ఇంకా ఒకొక్కప్పుడు, ఆ దిగువకు జారినవేళలో ఏమి జరిగింది? ఏమి జరిగింది? అనిపించవచ్చు. చేసిన దానికి ఇదా ఫలితం? ఏమీ చేయనివారే లోకంలో హాయిగా సుఖపడుతున్నారు? అన్న భావన కలుగవచ్చు. నిజానికి ఇదంతా కూడా అవసరంలేని విచికిత్స. అనావశ్యకమయిన ప్రేలాపన. అర్థంలేని ఆలోచన, అక్కరలేని ఒక భయం. అతడు నీ యోగక్షేమాల బాధ్యత నాది! అంటున్నాడు. "యోగస్థితిని నేను అందిస్తాను, క్షేమస్థితిని నేను సరిచూస్తాను. నీవు మాత్రం అనన్యచింతనలో ముందుకుసాగు" అన్నది ఆయన ఉపదేశం.

ఎప్పటికి మనకు ఏది క్షేమమో మనకు తెలుసా-అతనికి తెలుసా? ఈ అంశం మనకు ముందు బోధపడాలి! మనకు ఏది క్షేమమన్నదీ, ఎప్పుడు మనము ఏ స్థితిలో ఉంచబడాలన్నదీ, మనకన్నా అతడికే ఎక్కువ తెలుసు, కనుక అతడి నిర్ణయానికి మనం శిరస్సువంచాలి. అతడి నిర్ణయంలోని ఔచిత్యాన్ని గమనించడంలో మనబుద్ధి మనకు అంది రావాలి! అలా అందివచ్చినప్పుడు తెలుస్తుంది. ఏమని? అనన్యచింతనతో మనం సాగుతూ ఉండగా, జరుగకూడనిది జరుగదనీ, జరుగవలసినదే జరుగుతుందనీ, జరుగుతున్నదంతా మన క్షేమానికేననీ, తాత్కాలికంగా ఇబ్బంది అనిపించినా, ప్రతి



సన్నివేశం ఆ క్షేమంవైపుకే నడిపించగలుగుతున్నదనీ, దేవదేవుడు మన క్షేమం యెడల అంతగా బాధ్యత వహిస్తున్నాడనీ, జంకుగొంకులకూ, శంకలు, అనుమానాలకూ తావులేకుండా సన్నివేశాల రూపంలో అతడు నిర్దేశిస్తున్న కర్తవ్యాన్ని–నిశ్చితంగా, నిండుగా, నిర్వహించడమే మనం చేయవలసిన పని అని!

మనమేం చేయాలో సన్నివేశాల రూపంలో అతడు చెబుతున్నాడు. మనకేం కావాలో దానిని ఆ సన్నివేశాలవెంట మన చెంతకు నడిచివచ్చేలా చేస్తున్నాడు. వనరులు అతడు సమకూరుస్తున్నాడు. సలహాలను అతడు ఇస్తున్నాడు. సహకారాన్ని సిద్ధం చేస్తున్నాడు. నడువవలసిన పథాన్ని పొడగట్టిస్తున్నాడు. నడక సాగుతున్నవేళ కావలసినంతగా చేయూతనందిస్తున్నాడు. ఒక్కమాటలో చెప్పాలీ అంటే నీవెప్పుడు ఏం కావాలి? నీకెప్పుడు ఏంకావాలి అన్న అంశాలను తానుగా పట్టించుకొంటున్నాడు. కంటికి రెప్పలా కాచుకొంటున్నాడు. ఇంతకంటే యోగక్షేమాలను ఎవరు అందించగలరు? ఆలోచించండి.

ఒక రామకృష్ణుడు, ఒక వివేకానందుడు, ఒక మాస్టర్, ఇ.కె. అతడు చెప్పినట్లుగా నడిచిచూసారు. తమకేకాక యావత్ మానవజాతికే యోగక్షేమాలను సాధించిపెట్టారు. దేవదేవుని ఉత్సవ సమయాలుగా తమ తమ జీవిత కాలాలను నిండుగా నిర్వహించారు. మీరూ ఇలా నడిచిచూడండి. ఇంతటి నిండుదనాన్ని మీరూ మీ జీవితాలలో అనుభవించండి. అని తమ తమ జీవితాలతో మనకు ఉపదేశిస్తున్నారు. నిరూపణగా పిలుస్తున్నారు. మీరు ఏ నామాన్నైన్నా స్మరించండి, ఏ మూర్తినైనా కొలవండి, ఏ విధమయిన ఉపాసనము చేపట్టండి. అనన్యచింతనగా రూపొందినపుడు మాత్రమే మీ ప్రయత్నం సిద్ధిస్తుందని గమనించండి! అనన్యచింతన అలవడి, స్థిరపడేవరకు మీరున్నది ప్రయాణంలోనే, ప్రయత్నంలోనే అని గుర్తెరగండి! సిద్ధి ఎప్పుడూ అనన్యచింతనతో ముడిపడి ఉన్నదని తెలిపి మెలగండి – అని వారు తమ జీవితాలతో మృదువుగా హెచ్చరిస్తున్నారు. ప్రేమతో వెన్ను తడుతున్నారు.

రామకృష్ణ పరమహంస సాధన అమ్మవారి విగ్రహాన్ని ఆరాధించడంతో ప్రారంభమైంది. అలా విగ్రహారాధనగా ప్రారంభమైన సాధన అనన్యచింతనగా పర్యవసించింది. ఆ మాతను ఆయన అంతటా అన్నిటా చూడగలిగాడు. జగత్తును మాతగా జగన్మాతగా దర్శించగలిగాడు. అలాగే వివేకానందుడు



**మనచుట్టూ ఉన్న ఆనందాన్ని గుర్తించగలిగే దృష్టిని ఇవ్వమనడమే ప్రార్థన పరమార్థం.**



అనన్యచింతన వల్ల ఒనగూడే యోగక్షేమస్థితులను అనుభవపూర్వకంగా అందుకొని చూసాడు. రైలు ప్రయాణంలో సొమ్మసిల్లి పోయినప్పుడు మిఠాయిలవాడు అతడి దగ్గరకు పంపబడ్డాడు. జనసంచారం లేనిచోట ఆకలిదప్పులతో అతడు నిలిచినవేళ అక్కడికక్కడే అన్నపానీయాలు అతనికి అందించబడ్డాయి. భక్తుని క్షేమాన్ని భగవంతుడెంతగా పట్టించుకొంటాడో ఇలాంటి సందర్భాలు మనకు చక్కగా తెలియజెబుతాయి. అలాగే సర్వమత సమావేశానికి చికాగో వెళ్లినప్పుడు అలసిసొలసిన అతడు ఒక ఇంటిముందు పడిపోయాడు. ఆ ఇంటి దంపతులు కూడా ఆ సభలకే వెళుతూ ఉండటం విశేషం. స్వామిని సేదతీర్చి, వివరాలను కనుక్కొని సభలకు ఆయనను తోడ్కొని పోయారు వారు. అటుపైన స్వామి ప్రవచనం జరగడం, స్వామి పేరు ప్రపంచమంతా ఒకేసారి మారుమ్రోగడం జరిగింది. ఇలా పడిపోయిన చోటనే ఆయనకు రక్షణ ఈయబడింది. ఆయన యోగస్థితికి కావలసిన దోహదం ఆ సన్నివేశంలోనే నిక్షిప్తం చేయబడింది. ఇలా వివేకానందుని యోగక్షేమాలు నిరంతరం దైవం చేత చూచుకోబడ్డాయి.

సాధన ప్రారంభమయిన తొలినాళ్ళలో వివేకానందుడు కూడా తన బాధ్యతలను గురించీ, కుటుంబక్షేమాన్ని గురించీ కలవరపడ్డాడు. 'నాకు కుటుంబపరమయిన బాధ్యతలున్నాయి కదా! వాటికి అమ్మ ఏం చెబుతుంది? మీరు అమ్మను అడిగి చెప్పండి. అవి తీరితే కదా నేను లోకానికేమయినా చేయగలిగేది? అని రామకృష్ణునితో అన్నాడు. అందుకు రామకృష్ణులు 'అమ్మ అందరికీ అమ్మే! నేనడిగి చెప్పడమెందుకు? నీవే అడుగు?' అన్నారు. వివేకానందుడు అమ్మను సమీపించాడు. కాని ఏమీ అడుగలేకపోయాడు. నాకేమి కావాలో అమ్మకు తెలియదా? ఇది కావాలి అని నేను ఆమెను అడగాలా? అని అతడి కనిపించింది. అంతే! తన యోగక్షేమాలను అమ్మపాదాలకు ఆధీనం చేశాడు. తన కార్యక్రమానికి తాను అంకితమయ్యాడు.

**–పార్థసారథి ప్రవచనాలు**

**ఎవరైతే ఎప్పుడూ నా గురించిన విషయాలే వింటూ, మాట్లాడుతూ, ఎప్పుడూ "సాయి, సాయి" అన్న నా నామాన్నే స్మరిస్తూ "నన్నే" అనన్యంగా నమ్ముకొని ఉంటారో వారు ఇహ పరాల గురించి భయపడవలసిన పని లేదు.** **–శ్రీసాయి**

# అన్నదానం



భక్తుడు : గురువుగారూ! సత్సంగాలలో అన్నదానం చేయడం కరెక్టేనా?

గురువుగారు : ఎవరైనా ఒక్కరు ఇండివిడ్యువల్‌గా ఆతిథ్యం ఇస్తే దాన్ని అన్నదానం అనరు. శిరిడీలో మనవాళ్ళు కొంతమంది కలిసిచేస్తారు, ఒక్కోసారి ఒక్కొక్క ఫంక్షన్‌కు. దాన్నెప్పుడూ నేను అన్నదానం అనను. ఆతిథ్యమనే అంటాను, దానికోసం ఎవ్వరూ ఎవ్వరినీ డబ్బులు అడగడం లేదు. అన్నదానం ఎవరికోసం? మీరేమన్నా డబ్బులు లేనివాళ్ళా? మీకు అన్నం పెట్టడానికి మీరేమన్నా ఆకలిగొన్న జీవులా? బాబా, "ఆకలిగొన్న జీవికి అన్నం పెట్టండి" అన్నారు. మీరిక్కడ భోజనం చేసి, మళ్ళీ హొటళ్ళలో తింటారు. దాన్ని అన్నదానం అంటామా? మీరు చేసేటువంటి అన్నదానాల్లో, నిజంగా చెప్పాలంటే అన్నం లేకుండా ఉన్న ఆకలిగొన్న జీవులు ఎంతమంది ఉన్నారయ్యా, ఇక్కడ తినేవాళ్ళలో? చాలా తక్కువ మంది ఉంటారు. అదీ కొద్ది సత్సంగాలలోనే. అన్నదానం చేయాలంటే ఇలానే చెయ్యాల్సి అవసరం లేదు. ఆకలిగొన్నవారెవ్వరో తెలుసు మీకు. అక్కడ భిక్షగాళ్ళు పదిమంది ఉంటారు. ఆ భిక్షగాళ్ళను, అన్నంలేనివాళ్ళను తీసుకొని వచ్చి, ఆ పదిమందికో, ఇరవైమందికో భోజనం పెట్టండి చాలు. అన్నదానం పేరుతో డబ్బులు దండటం, ఆ డబ్బులు అన్నదానమంటూ అలా ఖర్చు పెట్టడం, డబ్బులు సరిగా ఖర్చు చేయలేదని ప్రక్కవాళ్ళు అనడం, ఇవన్నీ అవసరమా మనకు? అదొక ట్రెండ్‌లాగా అయిందయ్యా ఈ అన్నదానాలనేవి. నేను ప్రతిసారీ ప్రతి ఫంక్షన్‌కూ చెప్తాను. ఎందుకివి, మనకు అనవసరం కదా? అని. కాదు సార్, మాకు సరదా, మాకు ఇష్టమిది అంటారు. సరే వాళ్ళిష్టం. వాళ్ళు వాళ్ళ స్వంత డబ్బులు పెడుతున్నారు, ఎవరినీ అడగడం లేదు. మనం కాదని ఎందుకనాలి? ఎవరైనా అలా ఖర్చుపెట్టే పనైతే ఖర్చు పెట్టండి, అందుకు నాకేం ప్రాబ్లెమ్ లేదు. కానీ దాన్ని ఎవ్వరూ అన్నదానం అనరు. నేను వాళ్ళకు ఇచ్చే సలహా ఏమిటంటే, నిజంగా శిరిడీలో పదిరోజులు ఉండాలి, బాబా దగ్గర ఉండాలి. అక్కడ మనమేదైనా సేవ చేసుకోవాలి. అక్కడ సమయాన్ని సరిగా ఉపయోగపెట్టుకోవాలి అనుకొని అంతదూరం శిరిడీకి వెళ్ళి అక్కడ పదిరోజులు ఉండే శక్తిసామర్థ్యాలు లేనివాళ్ళు ఎంతోమంది ఉన్నారు. ఛార్జీ వరకు పెట్టుకొని శిరిడీకి వచ్చి ఎక్కడో లాకర్ తీసుకొని, ఒకపూట ఇక్కడ, ఒకపూట అక్కడ ఉంటూ ఉంటారు. ఎలాగైనా శిరిడీలో ఉండేటందుకు అవకాశం ఉండాలనుకునేటటువంటివాళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళెవరో తెలుసుకొని, వాళ్ళకు మాత్రం భోజనం పెట్టండి. వాళ్ళు ఒక ఇరవైమందో, ముప్పై మందో ఉంటారు. ఈ పద్ధతి రీజనబుల్‌గా ఉంటుంది.

డబ్బులు దండి అన్నదానాలు చేయమని బాబా చెప్పలేదు. దాన్ని అన్నదానం అనరు. అయ్యా, అన్నదానం చేస్తానంటూ మీరొక ప్రక్కన అడుక్కుంటూ అసలు మీరెందుకు అన్నదానం చెయ్యాలి? అలా చెయ్యమని నేను చెప్పలేదు. నేను చెప్పినవి ఎవ్వరూ ఫాలో చేయడం లేదు. నేనొక్కసారి చెప్తాను, చేస్తే చేస్తారు, లేకపోతే లేదు. నేను పట్టించుకోవడం మానేశాను.

–శ్రీబాబూజీ

1997-2017 GRACEFUL 20 YEARS

# గురుకృప

## వింశతి... ప్రస్తుతి...

శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ వంటి సద్గురువు బహు అరుదోయి...

ప్రపంచ ఆధ్యాత్మికతకు సరికొత్త వెలుగోయి... అని ఎలుగెత్తి చాటిన గళం 'గురుకృప'...

దర్శించినంతనే జీవితాలకు 'సాయి' అనే చక్కదనాన్ని చేకూర్చిన

ఆ శరశ్చంద్రుని దివ్య చరణ కమలములకు అక్షర చందన మద్దిన కలం 'గురుకృప'...

ఆ మహిమాన్వితుని అనుగ్రహదృష్టి కురిపించిన కృపావృష్టిలో తడిసి... తరించి... తన్మయమైన ....

భక్తజన అనుభవ సంకలనం 'గురుకృప'...

సదా సాయిని స్ఫురింపచేసే ఆ సద్గురు సన్నిధి... ఆయన ప్రకటించిన సాయితత్త్వం...

ఆయన సృజించిన 'సాయిపథ' జీవన విధానం.... ఇవే 'గురుకృప'కు ఊపిరి.

గురుకృపకు నాంది 'గురుకృప'... 'గురుకృపే' గురుకృపకు మార్గం...

గురుకృప గమ్యం 'గురుకృపే'.



83672 00045 gurukrupa@saimail.com gurukrupa.info